PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 32 | విజయవాడ, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 1 September 2024 | Rs



షూటింగ్‌లో రుబీనాకు కాంస్యం

- ఆర్చరీ క్వార్టర్స్‌లో పోరాడి ఓడిన శీతల్..

6



కాజ టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై వరదనీటిలో వాహనాలు

వర్ష బీభత్సం

- జలదిగ్బంధనంలో గుంటూరు, విజయవాడ నగరాలు
- కొండచరియలు కూలి ఆరుగురు, కారు కొట్టుకుపోయి ముగ్గురు మృతి
- వాగులో కొట్టుకుపోయి మరొకరి గల్లంతు

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో బీభత్సం సృష్టించాయి. శుక్రవారం రాత్రి నుండి శనివారం సాయంత్రం వరకు ఈ రెండు జిల్లాల్లో కుండపోతగా వర్షం కురిసింది. దీంతో విజయవాడ, గుంటూరు నగరాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లోనూ ఎక్కడ చూసినా రోడ్లమీద వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరింది. దీంతో రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. విజయవాడ - గుంటూరు మధ్య 30 సెం.మీ వర్షపాతం నమోదుకాగా, విజయవాడలో 18 సెం.మీ, గుంటూరు తూర్పు మండలంలో 25 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఇటీవల సంవత్సరాల్లో ఇదే అత్యధిక వర్షం. దీంతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారింది. కొండచరియలు విరిగిపడటంతో విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లో ఐదుగురు, గుంటూరు జిల్లా మంగళగిరిలో ఒకరు మరణించారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలో మురుగుకాల్వలోకి కారు కొట్టుకుపోయి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడులో వాగులో కొట్టుకపోయి మరొకరు మరణించారు. భారీగా వరద నీరు చేరడంతో గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజా గ్రామం వద్ద హైవేవైపు వాహనదారులు ఎవ్వరూ రావద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. విజయవాడలో దుర్గాఘాట్, ఫ్లై ఓవర్లను మూసివేశారు. ఏలూరు సర్వజన ఆస్పత్రిలో వర్షపు నీరు చేరింది. ఆర్‌టిసి సర్వీసులను అధికారులు రద్దు చేశారు. విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ (విటిపిఎస్)లో వరద నీరు చేరడంతో విద్యుదుత్పత్తి నిల్చిపోయింది. భారీ వర్షాల కారణంగా విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి 20 రైళ్లను రద్దు చేశారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం వద్ద తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 55 నుండి 65 కి.మీ మేర గాలులు వీచే అవకాశం ఉంది.

(వివరాలు లోపలి పేజీల్లో..)




విజయవాడ మొగల్రాజపురంలో విరిగిపడిన కొండచరియలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది

అప్రమత్తంగా ఉండండి

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారీవర్షాలు, వరదల నేపథ్యంలో అధి.కారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శనివారం ఉదయం నుండి అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకున్న సిఎం వర్షాల పరిస్థితిపై పలు దఫాలుగా సిఎస్, డిజిపి, మంత్రులు, కలెక్టర్లు, ఎస్‌పిలు, ఆర్‌డిఓలు, డిఎస్‌పిలతో సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను తీరందాటే జిల్లాల అధికారులు నిరంతరం పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. సహాయక చర్యల కోసం తీవ్రంగా ప్రభావం ఉన్న జిల్లాలకు రూ.3 కోట్లు, తక్కువ ప్రభావం ఉన్న జిల్లాలకు రూ.2 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వేర్వేరు ప్రాంతాల్లో ఎనిమిదిమంది మరణించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నట్లు చెప్పారు.



వాయుగుండం తీరం దాటనున్న నేపథ్యంలో ఆదివారం కూడా భారీ వర్షాలు ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలను సిఎం ప్రస్తావించారు. అధికారయంత్రాంగం ఏ మాత్రం ఆలసత్వం చూపకుండా విధి నిర్వహణ చేయాలని, అవసరమైతే రాత్రంతా మెలకువతో ఉండి పనిచేయాలని అన్నారు. గాలుల వేగాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. హుద్ హుద్

మిగతా 2లో

మీకు అండగా ఉంటా!

- నిరసనలో పాల్గొన్న వినేశ్ ఫోగాట్
- 200వ రోజుకు చేరిన రైతు ఉద్యమం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించాలని కోరుతూ శంభు సరిహద్దు వద్ద రైతులు చేపట్టిన ఉద్యమం శనివారం నాటికి 200వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ రెజ్లర్, ఒలింపియన్ వినేశ్ ఫోగాట్ అక్కడికి వచ్చి రైతులతో కలసి నిరసనలో పాల్గొన్నారు. అనంతరం ఆమె రైతులనుద్దేశంచి మాట్లాడుతూ, 'మేము అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాము. కానీ, సొంత కుటుంబానికి (రైతులకు) మనం ఏమీ చేయలేని అశక్తులుగా ఉన్నామే అన్న బాధ మమ్మల్ని వెంటాడుతోంది. కేంద్ర ప్రభుత్వం రైతుల గోడును ఆలకించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. నేను మీ కూతురునే. ఎప్పుడూ మీ వెంటే ఉంటా.' అని భరోసా ఇచ్చారు. పారిస్ ఒలింపిక్స్‌లో 50 కి. మీ కుస్తీ పోటీ ఫైనల్లో వినేశ్ ఫోగాట్‌పై అనర్హత వేటు వేయడంతో పతకం కోల్పోయారు. దీని వెనక ఢిల్లీ పెద్దల హస్తం ఉందన్న విమర్శలు వచ్చాయి. గత ఏడాది భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీలో నడిరోడ్డుపై రోజుల తరబడి రెజ్లర్లు సాగించిన పోరాటంలో వినేశ్ పోగాట్ చురుగ్గా వ్యవహరించినందుకు కక్ష సాధింపుగా ఆమెపై అనర్హత వేటు పడేలా చేశారని ప్రతిపక్షాలు విమర్శించాయి. రైతులు ఫోగాట్‌ను అంభినందిస్తూ పోరాట వేదిక వద్ద సత్కరించారు. ఆ తరువాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ, రైతుల డిమాండ్లు ఇప్పటికీ నెరవేర్చకపోవడం వల్లే వారు మళ్లీ రోడ్డెక్కాల్సిన పరిస్థితి ప్రభుత్వమే కల్పించిందని అన్నారు. వారి డిమాండ్లు తీరేవరకు పోరాటం కొనసాగుతుంది. రైతులు మాకు తిండి పెట్టకపోతే మేము క్రీడల్లో పోటీపడగలిగేవారమా? అని చెప్పారు. విశాల హృదయంతో దేశానికి అన్నం పెడుతున్న రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. రైతుల పోరాటం ఎన్నటికీ వృథా కాదని ఆమె అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే, మీరు

మిగతా 7లో



తమకు మద్దతు తెలిపేందుకు వచ్చిన వినేశ్ ఫోగాట్‌ను సత్కరిస్తున్న రైతులు

కృష్ణాజలాల వివాదంపై అఖిలపక్షం

ప్రభుత్వాన్ని కోరిన సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణాజలాల పంపిణీ వివాదం నేపథ్యంలో వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర దీర్ఘకాల ప్రయోజనాల రీత్యా అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాల అభిప్రాయాలను తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు సృష్టించడానికి చేస్తున్న ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజానీకానికి సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున ఆయన విజ్ఞప్తి చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ బుధవారం చేపట్టిన విచారణలో ఇప్పటికే ఇచ్చిన తీర్పులకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పున:పంపిణీ అంశాన్ని చేపట్టిందని తెలిపారు. పోలవరం ద్వారా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లింపు, తెలుగుగంగ ప్రాజెక్టు కేటాయింపులతో పాటు ఇంకా నిర్మించని అమరావతి రాజధాని, అసలు రూపురేఖలే లేని మూడు బ్యారేజీలు వంటి విషయాలపైనా ట్రిబ్యునల్ చర్చించనున్నట్లు 36 అంశాలతో జాబితాను ట్రిబ్యునల్ ప్రకటించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో చిట్ట చివరన ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు కాపాడటానికి రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు ఉమ్మడి అభిప్రాయానికి రావడం అవసరమని తెలిపారు. అందుకోసం రాష్ట్రప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు.

శ్రావణ్ షిప్పింగ్‌లో విషవాయువు లీక్

- ఐదుగురికి అస్వస్థత

3



బాధితులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

93.37 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో 93.37 శాతం మంది ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ లబ్ధిదార్లకు పింఛన్లను పంపిణీ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ సైట్‌లో వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో 64,61,485 మందికి పింఛన్లు విడుదల కాగా, 60,33,325 మందికి పంపిణీ చేశారు. రూ.2729.86 కోట్లను పంపిణీ చేయాల్సి ఉండగా, రూ.2,548 కోట్లను పంపిణీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీకి అంతరాయం కలిగినట్లు అధికారులు వెల్లడించారు.

భారీ వర్షాలున్న ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగులకు సిఎం చంద్రబాబు వెసులుబాటు కల్పించారు. ఆయా ప్రాంతాల్లో ఇబ్బందులుంటే వచ్చే ఒకటి, రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయవచ్చని చెప్పారు. ఈ విషయంలో సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావద్దని, టార్గెట్ పెట్టవద్దని కలెక్టర్లను ఆదేశించారు.

త్రిపుల్ ఐటి డైరక్టర్ తొలగింపు

- నూజివీడు క్యాంపస్‌లో ముగ్గురు సభ్యులతో పర్యవేక్షక కమిటీ
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూజివీడు త్రిపుల్ ఐటిలో ఇటీవల జరిగిన కలుషితాహారం ఘటనలో డైరక్టర్‌ను ప్రభుత్వం తొలగించింది. విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డైరక్టర్‌ను తొలగించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్రిపుల్ ఐటి పర్యవేక్షణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు, ఏలూరు కలెక్టర్ కె వెట్రిసెల్వి సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు ఆహార నాణ్యత, చిన్నచిన్న మరమ్మతులు, సున్నితమైన అంశాలు, వైద్య పర్యవేక్షణపై ఫిర్యాదులు వంటి సమస్యల తక్షణ పరిష్కారానికి



నిర్ణీత సమయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కమిటీకి సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత నిర్వహణ, పారిశుధ్యం, నాణ్యతా ప్రమాణాలు, లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై సూచనలు చేశారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే, వెంటనే కమిటీ ఆ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని వెల్లడించారు.

చిత్ర పరిశ్రమలో మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

- దేశానికే మోడల్‌గా హేమా కమిటీ : గోవిందన్

వైద్యుల రక్షణకు తక్షణమే చట్టం

- జాతీయ టాస్క్ ఫోర్స్‌కు ఐఎంఎ మరోమారు లేఖ

7

హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీ మార్పు

- అక్టోబర్ 5న పోలింగ్, 8న ఫలితాలు

చండీగఢ్ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీ మారింది. ముందుగా ఎన్నికల సంఘం (ఇసి) ప్రకటించినట్టుగా ఎన్నికలు అక్టోబర్ 1న జరగాల్సి ఉన్నది. బిష్ణోయ్ కమ్యూనిటీ నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఇసి ఎన్నికల తేదీని ఇదే నెల 5కు మార్చింది. బిష్ణోయ్ కమ్యూనిటీ పండుగ ఇదే సమయంలో ఉండటంతో ఓటింగ్ హక్కులను గౌరవిస్తూ ఎన్నికల తేదీని మార్చినట్టు ఇసి ప్రకటించింది. ముందుగా ప్రకటించినట్టుగా హర్యానాతో పాటు జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 4న వెలువడాల్సి ఉన్నది. హర్యానాలో ఎన్నికల తేదీ అక్టోబర్ 5కు వాయిదా పడటంతో ఈ రాష్ట్రంతో పాటు జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కూడా అదే నెల 8న వెలువడనున్నాయి. బిష్ణోయ్ తరగతికి చెందిన పండుడ అక్టోబర్ 2న వస్తున్నది. దీంతో వేలాది కుటుంబాలు రాజస్థాన్ లోని తమ ఇండ్లకు వెళ్లనున్నాయి. ఈ కారణంతో వారు ఓటు హక్కుకు దూరమయ్యే అవకాశమున్నది. ప్రజల భావోద్వేగాలను గౌరవి స్తూనే హర్యానా అసెంబ్లీ ఎన్నికలు, ఫలితాల తేదీలను మార్పు చేసినట్లు ఇసి ప్రకటించింది.

విచారణ జరుగుతుండగానే...

ఇంటికి పంపేస్తున్నారు

- నిరాకరించిన విద్యార్థినులపై యాజమాన్యం ఒత్తిడి
- గుడ్లవల్లేరు కళాశాల వసతి గృహం ఖాళీ
- భారీ పోలీసు బందోబస్తు



గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల నుండి బలవంతంగా విద్యార్థులను ఇళ్లకు పంపుతున్న పోలీసులు, సిబ్బంది

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు ఇంజనీరింగ్ కళాశాల బాలికల వసతి గృహం కామన్ బాత్‌రూమ్‌లలో హిడెన్ కెమెరాలు ఏర్పాటు ఘటనలో యాజమాన్యం విద్యార్థుల పట్ల వివాదాస్పదంగా వ్యవహరిస్తోంది. కెమెరాల విషయంలో ఫిర్యాదు అందినా స్పందించలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న యాజమాన్యం తాజాగా ఈ ఘటనపై పోలీసు విచారణ కొనసాగుతుండగానే విద్యార్థులను బలవంతంగా ఇళ్లకు పంపుతోంది. ఇప్పటికే తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులకు భరోసా కల్పించి వారి భయాన్ని పోగొట్టాల్సిందిపోయి తొలి నుంచీ వివాదాస్పదంగా వ్యవహరిస్తోంది. ఘటన పట్ల భయాందోళనకు గురైన విద్యార్థినుల్లో కొద్దిమందిని వారి తల్లిదండ్రులు కళాశాల వసతి గృహం నుండి ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. మిగిలిన విద్యార్థినులను వసతి గృహం నుండి యాజమాన్యం బలవంతంగా ఖాళీ చేయిస్తోంది. వెళ్లడానికి నిరాకరించిన వారిని భయపెట్టి, ఒత్తిడి తెచ్చి మరీ కళాశాల బస్సుల్లో ఇళ్లకు తరలిస్తోంది. శనివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో మూడు బస్సుల్లో విద్యార్థులను బలవంతంగా తరలించింది. ఇళ్లకు వెళ్లడానికి కొందరు నిరాకరిస్తూ కళాశాల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. కళాశాల యాజమాన్యం తమను బలవంతంగా బస్సుల్లో ఎక్కించేసిందని పలువురు విద్యార్థినులు వాపోయారు. యాజమాన్యం వైఖరిని ఖండిస్తూ కళాశాల బస్సులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని గుడివాడ వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. కళాశాలలోకి ఎవరూ వెళ్లకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న విచారణ

కళాశాల వసతి గృహంలో కెమెరాల ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బిటెక్ విద్యార్థి విజయ్‌తోపాటు ఆయన స్నేహితులను అదుపులోకి తీసుకొని గుడ్లవల్లేరు స్టేషన్‌కు తరలించి కృష్ణా జిల్లా ఎస్‌పి బి.గంగాధరరావు పర్యవేక్షణలో ప్రత్యేక అధికారులు వారిని రోజంతా విచారించారు. అంతకుముందు విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు బృందం కళాశాల విద్యార్థినుల నుంచి వివరాలు సేకరించింది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను పరిశీలిస్తోంది. ఈ ఘటనపై విచారణ వివరాలను సెప్టెంబర్ నాలుగో తేదీన వెల్లడిస్తామని మీడియాకు ఎస్‌పి తెలిపారు.

సోషల్ మీడియాలో హల్‌చల్

బాత్‌రూమ్‌లో హిడెన్ కెమెరాలపై సోషల్ మీడియాలో వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. బాలికల కామన్ బాత్‌రూమ్‌లోని షవర్లను పోలీసులు తొలగించి తీసుకెళ్తున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. షవర్లలో ఈ కెమెరాలను అమర్చారనే ఆరోపణలతో పోస్టులు పెడుతున్నారు.



విజయవాడ బస్టాండ్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై భారీగా చేరిన వర్షం నీరు, నీటిలో నిలిచిపోయిన బస్సులు



విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతంలో ఇళ్లలోకి ప్రవేశించి ఇబ్బంది పడుతున్న ప్రజలను పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, నాయకులు కె.దుర్గారావు, శ్రీనివాస్



విజయవాడ కనకదుర్గ గుడి ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు

అతలాకుతలం

ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కుంభవృష్టి

- చెరువులను తలపించిన విజయవాడ రోడ్లు
- ముంపులో వేలాది ఎకరాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కుండపోత వర్షాలు ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలను అతలాకుతలం చేశాయి. బీభత్సం సృష్టించాయి. జనజీవనం స్తంభించింది. ఎన్‌టిఆర్ జిల్లాలో శనివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 111.2 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది. విజయవాడ నగరం గతంలో ఎన్నడూలేని విధంగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎటువైపు చూసినా మోకాళ్లలోతు నీరు రోడ్లపై నిలిచిపోయింది. భవనాల పైనుండి చూస్తే నగరం నీటిలో తేలియాడుతున్నట్లు కనిపించింది. లోతట్టు ప్రాంతాల్లో పలు ఇళ్లలోకి నీళ్లు చేరాయి. విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటరు ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వారిలో నవుడు మేఘన (25), బోలెం లక్ష్మి (48), లాలు (37), జంపాన అన్నపూర్ణ (65), కామరి సంతోష్ (18) ఉన్నారు. ఈ ఘటనలో మరో నలుగురు గాయపడ్డారు. రెండు గృహాలు ధ్వంసమయ్యాయి. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పర్యటించారు. మృతుల కుటుంబాలను, బాధితులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చందర్లపాడులో ఓ ద్విచక్ర వాహనదారుడు వాగులో కొట్టుకుపోయాడు.

దుర్గగుడి ఘాట్ రోడ్డుపై విరిగిపడిన కొండచరియలు

దుర్గగుడి ఘాట్ రోడ్డుపై కొండచరియలు విరిగిపడ్డాయి. ప్రోటోకాల్ కార్యాలయంపై కొండరాళ్లు పడ్డాయి. ఘాట్ రోడ్డును మూసివేశారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్‌లోని ఎరైవల్ బ్లాక్‌పైకి రెండడుగుల మేర వర్షం నీరు చేరింది. పార్సిల్ గోడౌన్‌లోకి నీరు చేరి పలు రకాల సరుకులు తడిచిపోయాయి. బస్టాండ్ ప్రాంతంలోని రైల్వే బ్రిడ్జి వద్ద భారీ స్థాయిలో చేరిన నీటిలో ఐదారు బస్సులు చిక్కుకుపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. విజయవాడ నుంచి రూరల్ ప్రాంతాలకు వెళ్లాల్సిన 13 రూట్లలో 68 ఆర్‌టిసి సర్వీసులను అధికారులు రద్దు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 20 రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. గన్నవరం విమానాశ్రయంలో విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి.

కృష్ణా జిల్లాలో 11,285 ఎకరాల్లో పంటలు మునక

కృష్ణా జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 నుండి శనివారం రాత్రి ఏడు గంటల వరకు 211.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. తొమ్మిది మండలాల్లో 11,285 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. బంటుమిల్లి, కృత్తివెన్ను, ఘంటసాల, మొవ్వ, మోపిదేవి, కోడూరు తదితర మండలాల్లో వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పెనమలూరులో పశువులపాక కూలి నాలుగు గొర్రెలు మరణించాయి. కృష్ణా ఇస్ట్రన్ డెల్టా బ్యాంక్ కెనాల్ పొంగి మోపిదేవి మండలం వార్పుపైకి నీరు చేరింది. బందరులో రోడ్లపై మూడు నుంచి నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. గుడివాడ, పెడన మున్సిపాల్టీల్లో పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.



కృష్ణా బ్రిడ్జి వద్ద కృష్ణమ్మ పరవళ్లు

కాజా హైవేపై వరద నీటి ఉధతి

గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అతి భారీ వర్షం కురిసింది. గుంటూరు తూర్పు మండలంలో 252.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో పగటి పూట 12 గంటల వ్యవధిలో 147 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జాతీయ రహదారికి సమీపంలోని పెదకాకాని మండలం ఉప్పలపాడు వద్ద మురుగు కాల్వలోకి కారు కొట్టుకుపోయి ముగ్గురు దుర్మరణం చెందారు. వారిలో నంబూరు వివా స్కూలు టీచర్ నడింపల్లి రాఘవేంద్ర (38), విద్యార్థులు పసుపులేటి సౌదీష్ (8), కోడూరి మాన్విత్ (9) ఉన్నారు. పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో స్కూలు నుంచి తిరిగి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంగళగిరిలో కొండచరియలు విరిగిపడి రుక్క నాగరత్నమ్మ (88) మహిళ మృతి చెందారు. తెనాలిలో అత్యధికంగా 170 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మంగళగిరి మండలం కాజా గ్రామం వద్ద హైవేపై వరద నీరు ఉధతంగా రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహనదారులు ఎవ్వరూ జాతీయ రహదారి వైపు రావద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. తాడికొండ–తుళ్లూరు మధ్య కోటేళ్ల వాగు పొంగి ప్రవహించడంతో రాజధాని వెలగపూడికి రాకపోకలు నిలిచిపోయాయి. తాడికొండ–గుంటూరు–అమరావతి మధ్య కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో చప్టాలపైకి నీరు వచ్చింది. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం గోలి వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సత్తెనపల్లి మండలం పెదమక్కెన వద్ద చప్టాపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలను ఆపివేశారు. భారీ వర్షాలకు గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు లక్ష ఎకరాల్లో వరి పైరు నీటమునిగాయి. వర్షం నీరు బయటకు పంపేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

నూజివీడులో చెట్టుపై ఒకరు, విద్యుత్ స్తంభంపై మరొకరు చిక్కుకున్న వైనం

శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఏలూరు జిల్లాలో 41.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నూజివీడులో పెద్దచెరువుకు గండి పడడంతో ఒక్కసారిగా ముంచెత్తిన వరదకు నూజివీడు బైపాస్ రోడ్‌లో చెట్టుపై ఒక వృద్ధుడు, పోతిరెడ్డిపల్లిలో కరెంటు స్తంభంపై ఒక యువకుడు చిక్కుకున్నట్లు శనివారం రాత్రి గుర్తించారు. వారిని రక్షించేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం రంగంలోకి దిగినా వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో సాధ్యం కాలేదు. జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు ఆర్‌డిఒ భవాని శంకరి ఆ ప్రాంతంలోనే ఉండి వారు ఇరువురినీ సురక్షితంగా కాపాడేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. రాత్రి పది గంటల సమయానికి కూడా ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది వారిని చేరుకోవడం సాధ్యం కాలేదు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ముసునూరు మండలంలో అత్యధికంగా 126.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో 96.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పాలకొల్లులో అత్యధికంగా 199.4 మిల్లీమీటర్లు, పెనుమంట్రలో 131 మిల్లీమీటర్ల వర్షం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఏలూరులోని పవర్‌పేటలో రోడ్లపై మోకాలి లోతు నీరు నిలిచిపోయింది. సర్వజన ఆస్పత్రిలోకి వర్షపు నీరు చేరడంతో ఎత్తిపోయాల్సి వచ్చింది. నూజివీడులో పెదచెరువుకు గండిపడడంతో 450 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. నూజివీడు బస్టాండ్‌లోకి భారీగా వర్షం నీరు చేరింది. నూజివీడు–విస్సన్నపేట, నూజివీడు–హనుమాన్ జంక్షన్ రోడ్లు నీటమునిగాయి.

అల్లకల్లోలంగా ఉప్పాడ తీరం

కాకినాడ జిల్లా ఉప్పాడ తీరం వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. పెద్ద ఎత్తున కెరటాలు ఎగిసి పడ్డాయి. సామర్లకోట, కాకినాడ, యు.కొత్తపల్లి, పెద్దాపురం, కోటనందూరు మండలాల్లో భారీ వర్షం కురిసింది. తాండవ రిజర్వాయర్‌లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో దిగువన ఉన్న గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజానగరం, కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు మండలాల్లో ఎడతెరిపి లేకుండా ఉదయం నుంచి రాత్రి వరకూ తేలికపాటి జల్లులు పడుతూనే ఉన్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం, అమలాపురం, అయినవిల్లి, మామిడికుదురు, పి.గన్నవరం, అంబాజీపేట మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

విశాఖ పూర్ణా మార్కెట్‌లో స్తంభించిన లావాదేవీలు

భారీ వర్షాలకు విశాఖ నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, పూర్ణా మార్కెట్, దుర్గాలమ్మ గుడి, ప్రసాద్ గార్డెన్స్, చావుల మదుం, పోర్ట్ ప్రాంతంలోని బరోడా రోడ్డు, పాత పోస్ట్ ఆఫీస్, డాల్ఫిన్ జంక్షన్ తదితర చోట్ల వర్షపు నీరు రోడ్డుపై భారీగా నిలిచిపోయింది. నిత్యం రద్దీగా ఉండే పూర్ణా మార్కెట్‌లో సైతం ఎటువంటి వ్యాపార లావాదేవీలూ జరగలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బీంపోలు పంచాయతీ రామచంద్రపురం గెడ్డ పొంగి ప్రవహించడంతో గిరివాసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మర్దగూడ, లక్ష్మీపురం మధ్య ఉన్న గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. అనకాపల్లి జిల్లాలోనూ వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో పలుచోట్ల డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. పలు కాలనీల్లోకి నీళ్లు చేరాయి. కర్నూలు రోడ్డు పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. బాపట్ల జిల్లా రేపల్లె, నగరం, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో వరి పైరు నీటి మునిగింది. వర్షాలకు డ్రెయిన్లు ఎగదన్నుతుండడంతో వరద నీరు బయటకు వెళ్లే మార్గం లేక చేలల్లో నీరు నిలిచిపోయింది. కర్నూలు నగరంలో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. గార్గేయపురం, కేతవరం రహదారి నదిని తలపించింది. కొత్తపల్లి మండలం శివపురం, లింగాపురం వాగు పొంగి పొరడంతో 12 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. శ్రీశైలంలో రోడ్లు కాలువలను తలపించాయి. మహానంది మండలంలో అరటి తోటలు నీట మునిగాయి. నంద్యాల జిల్లా చాగలమర్రి, పాములపాడు మండలాల్లో ఎడతెరఫి లేని వర్షానికి మూడు మట్టి మిద్దెలు కూలాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. పోలాకి మండలంలో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. అనంతపురం, శ్రీసత్యసాయి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడ్డాయి. వైఎస్‌ఆర్, అన్నమయ్య , తిరుపతి, చిత్తూరు జిలాల్లో చిరు జల్లులు పడ్డాయి.



ఒంగోలులో నీట మునిగిన కూరగాయల మార్కెట్



గుంటూరు బ్రాడీపేటలో వర్షపు నీటిలో మునిగిన ఆటో, కారు



కొండచరియలు విరిగిపడి మృతి చెందిన రుక్మా నాగరత్నమ్మ



మృతి చెందిన విద్యార్థి మన్విత్



ఉప్పలపాడు వద్ద కారు కొట్టుకుపోయి మృతి చెందిన ఉపాధ్యాయులు రాఘవేంద్ర



మృతి చెందిన విద్యార్థి సౌదీప్

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు నోడల్ ఆఫీసర్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు పేర్కొన్నారు. అనంతపురం సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ట్రైనింగ్స్) డిఎస్ వర కుమార్, నెల్లూరు సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ఎనర్జీ కన్సర్వేషన్, క్వాలిటీ కంట్రోల్) కె. ఆది శేషయ్య, తిరుపతి సర్కిల్‌కు జనరల్ మేనేజర్ (ఐటి, శాప్) సిహెచ్. రామచంద్రరావు, కడప సర్కిల్‌కు జనరల్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్) పి.మురళి, కర్నూలు సర్కిల్‌కు జనరల్ మేనేజర్ (కమర్షియల్) ఎస్.కె. ఇస్మాయిల్ అహమ్మద్‌లను నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. వాట్సాప్ నంబరు 91333 31912కు చాట్ చేసిసమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

సిసిఎల్‌ఎ నేతృత్వంలో వర్షాలు, వరదపై ఉన్నతస్థాయి కమిటీ

- ఎక్కడికక్కడ కంట్రోలు రూముల ఏర్పాటు
- నాలుగు జోన్ల పర్యవేక్షణకు నలుగురు అధికారులు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో పర్యవేక్షణ, ముందు జాగ్రత్త, సహాయక చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిసిఎల్‌ఎ జి.జయలక్ష్మి ఆధ్వర్యాన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ దీనికి కో ఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యాన కుంచనపల్లిలోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. కమిటీలో సిసిఎల్‌ఎ కార్యదర్శి ప్రభాకరరెడ్డి, శ్రీకేష్ లత్కర్ బాలాజీ, ఎం.హరినారాయణ, కృష్ణతేజ, మీడియం ఇరిగేషన్ ఎస్‌ఇ, వ్యవసాయశాఖ జెడి, హార్టికల్చర్, ఫిషరీస్, పశు సంవర్ధకశాఖల ఎడిలు లేదా జెడిలు సభ్యులుగా ఉన్నారు. వీరితోపాటు ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఇలు కూడా సభ్యులుగా ఉంటారు. ఎపిఎస్‌ఆర్‌టిసి, పౌరసరఫరాలు, విద్యుత్, సాంకేతికశాఖను అధికారులు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో నాలుగు జోన్లలో వరదల పర్యవేక్షణకు డిప్యూటీ కలెక్టర్‌స్థాయి అధికారులతో కమిటీ వేశారు. వీరిటో విజయసారథి, విశ్వేశ్వరనాయుడు, వరదా సుబ్బారావు, బాలకృష్ణ ఉన్నారు. రాష్ట్ర సెక్రటేరియట్లోని కమాండ్ కంట్రోలు రూములో కోన శశిధర్, ఐఎఫ్‌ఎస్ అధికారి సుందర్‌ను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

వీరు రాష్ట్రంలో ఉన్న 14,700 సిసి కెమెరాలు, డ్రోన్ల ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరించి ఎప్పటికప్పుడు జిల్లాలో ఉన్న కంట్రోలు రూములతో సమన్వయం చేసుకుంటూ సూచనలు ఇవ్వనున్నారు. ఇవికాకుండా విద్యుత్, రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యాన మరొక కంట్రోల్ రూముల ఏర్పాటు చేయాలని సిఎస్ ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ కంట్రోలు రూములు ఏర్పాటు చేయాలని కోరారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఈ కంట్రోలు రూములు కొనసాగుతాయని సిఎస్ తెలిపారు. కంట్రోలు రూము బాధ్యతలు అప్పగించిన అధికారులు వెంటనే విధుల్లోకి వెళ్లాలని అందులో పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ మొఘల్రాజపురం కొండచరియలు విరిగిపడి నలుగురు మృతి చెందడం, పలువురు గాయపడటం విచారకరమని సిపిఎం రాష్ట్ర కమిటీ తరుపున కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై శనివారం ప్రకటన విడుదల చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, భవిష్యత్‌లో కొండ ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించకుండా ప్రభుత్వం తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలను రక్షించడానికి కావాల్సిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొండ ప్రాంతాల్లో రక్షణ చర్యలు, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధులు కేటాయించి ప్రజలను రక్షించాలని కోరారు.

సిఎం కర్నూలు జిల్లా పర్యటన రద్దు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు రావల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన శనివారం రద్దు అయింది. భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన నిలిచిపోయింది. ఓర్వకల్లు గ్రామంలో పింఛన్ల పంపిణీ చేయడంతోపాటు అక్కడే గ్రామస్తులతో సమావేశమయ్యేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో చివరి నిమిషంలో సిఎం పర్యటన రద్దయ్యింది.

ప్రమాదాల బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు

- ఇంధన శాఖప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాల పట్ల అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆ శాఖ సిబ్బందిని ఆదేశించారు. భారీ వర్షాలతో పాటు ఉపరితల గాలులు బలంగా వీస్తాయని ఐఎండి అంచనా వేసిందని, కాబట్టి అధికారులు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని చెప్పారు. జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జెఎండి సిహెచ్ కీర్తి, డిస్కంల సిఎండిలు పట్టాన్‌శెట్టి రవి సుభాష్, ఐ పృధ్వీతేజ్, కె సంతోష్‌రావు, ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్‌లతో కలిసి శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి ఏవైనా సంఘటనలు చోటుచేసుకుంటే వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనడానికి, అవసరమైన మరమ్మతు పనులు చేసేందుకు సరిపడా సామాగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా తలెత్తే విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం డిస్కంల పరిధిలోనే కాకుండా సర్కిల్, డివిజన్ స్థాయిలో నిరంతరం పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు.

ప్రజల నుంచి వచ్చే విద్యుత్ సంబంధిత ఫిర్యాదులపై తక్షణం స్పందించి మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని కూడా అంచనా వేసి నివేదికలు పంపించాలని సూచించారు.

పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు ఏ అధికారి సెలవు తీసుకోకూడదని ఆదేశించారు. సరఫరాలో సమస్యలు ఎదురైతే ప్రజలు వెంటనే సంబంధిత అధికారులు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఎలాంటి విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలను ఎప్పటికప్పుడు ప్రమాదాల బారినపడకుండా అప్రమత్తం చేయాలని చెప్పారు. విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విటిపిఎస్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

- కోల్‌ప్లాంట్‌లోకి చేరిన నీరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్(విటిపిఎస్)లో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచింది. ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో విటిపిఎస్‌లోని కోల్‌ప్లాంట్‌లోకి పూర్తిగా నీరు చేరింది. దీంతో కోల్‌లోడ్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. ప్లాంట్‌లో 210 మెగావాట్ల(మెవా) యూనిట్లు 6, 500 మెగా, 800 మెగా యూనిట్లు ఉన్నాయి. బొగ్గు తీసే పరిస్థితి లేకపోవడంతో అన్ని యూనిట్లు మూతపడ్డాయి. ఈ వరద నీటిని బయటకు పంపేందుకు ప్లాంట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి లేకపోవడం, వర్షం కారణంగా కొన్నిచోట్ల విద్యుత్ కోతలు ఏర్పడ్డాయి.

విజయవాడ ఘటన దురదృష్టకరం

- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలో కొండ చరియలు విరిగిపడ్డ ఘటనలో నలుగురు మరణించడం పట్ల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఎనిమిదిమంది మరణించినట్లు అధికారులు చెప్పారని వెల్లడించారు. గాయపడ్డవారికి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలందిస్తుందని పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఉప్పలపాడు ఘటనపై లోకేష్ దిగ్భ్రాంతి

గుంటూరు జిల్లా ఉప్పాలపాడు ఘటనపై మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరద ఉధృతికి ఉపాధ్యాయులు రాఘవేంద్రరావు, విద్యార్థులు సౌరీష్‌బాబు, మాన్విక్ ప్రాణాలు కోల్పోవడం కలచివేసిందని పేర్కొన్నారు. వీరి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం, విపత్తు నిర్వహణ శాఖ అలెర్ట్ మేసేజ్‌లు గమనిస్తూ తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, టిడిపి నేతలు, కార్యకర్తలు సహాయక చర్యలకు సహకారం అందించాలని కోరారు. విపత్తుల సమయంలో టిడిపి ప్రజలకు అండగా ఉంటుందనే భరోసా కల్పించాలని తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

మొదటిపేజి తరువాయి

తుపాను సమయంలో అనుసరించిన పద్ధతులను అనుసరించాలన్నారు. వర్షాలు తగ్గేవరకూ ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బుడమేరు ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న వంతెనలపై రాకపోకలు నిషేధించాలని ఆదేశించారు. విజయవాడ నగరంలో రోడ్లపై నిలిచిన నీరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు, గాలుల వల్ల విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉందని, కరెంటు సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చిన వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నచోట్ల అక్కడ ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. సైక్లోన్ షెల్టర్లను సిద్ధం చేయాలని, గర్భిణులను గుర్తించి వారికి కావాల్సిన వైద్య సేవలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలన్నారు. ప్రమాదం జరిగిన తరువాత సహాయం చేయడం కంటే జరగకుండా చూడటం ఉత్తమమని పేర్కొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - కోవెలకుంట్ల (నంద్యాల జిల్లా)



రామానాయుడు(ఫైల్)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కలుగొట్ల గ్రామానికి చెందిన కౌలు రైతు రామానాయుడు (38) రెండేళ్లుగా ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. గతేడాది ఐదు ఎకరాల్లో మిరప, ఎకరం పొలంలో వరి పంటలు సాగు చేశారు. వర్షాభావంతో పంటలు దెబ్బతినడం, గిట్టుబాటు ధర లభించకపోవడంతో నష్టం వాటిల్లింది. పంటల సాగు కోసం చేసి అప్పులు రూ.18 లక్షలకు చేరుకున్నాయి. అప్పులు తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. రైతుకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

గోల్డ్‌మాన్ శాక్స్ సిబ్బందిపై వేటు

న్యూయార్క్ : ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ తమ ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధం అయ్యిందని సమాచారం. మొత్తం ఉద్యోగుల్లో 3 నుంచి 4 శాతం మందిని ఇంటికి పంపించడానికి ప్రక్రియను ప్రారంభించినట్లు రిపోర్టులు వస్తున్నాయి. సిబ్బంది వార్షిక పనితీరు సమీక్ష ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రానున్న కొన్ని వారాల్లో ఈ తొలగింపులు చోటు చేసుకోనున్నాయి. 1300 మందికి పైగా ఉద్యోగులపై వేటు పడనుందని అంచనా. అంతర్గతంగా ఈ ప్రక్రియ ప్రారంభమయ్యిందని.. కానీ ఆ సంస్థ అధికారికంగా ప్రకటించలేదని తెలుస్తోంది. ఈ ఏడాది జూన్30 నాటికి సంస్థలో 44,300 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

బిజెపికి మద్దతు ఉపసంహరించుకోండి

- **చంద్రబాబుకు సూచించిన సిపిఐ నారాయణ**

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం సంక్షోభంలో పడిందని, బిజెపికి చంద్రబాబు తన మద్దతును ఉపసంహరించుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. తిరుపతి గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... దేశంలో నరేంద్ర మోడీ గ్రాఫ్ రోజు రోజుకూ తగ్గుతోందని, మోడీని మార్చాలని బిజెపి నేతలే అంటున్నారని, మోడీ తీరుపై ఆర్‌ఎస్‌ఎస్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. మోడీ నియంతృత్వ పోకడలతో జనం విసిగిపోయారని, బంగ్లాదేశ్ పరిస్థితులే ఇండియాలో వచ్చే పరిస్థితి ఉందన్నారు. వైసిపి హయాంలో ఆంధ్రలో జరిగిన భూ అక్రమాలపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు. 'యాప్ రుణాల పేరుతో వేధించే వారిని ఇళ్లకు వస్తే కట్టేయండి' అని సూచించారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో ఆక్రమణలు తొలగిస్తున్నారని అదే తరహాలో ఎపిలో కూడా చేయాలని చంద్రబాబుకు సూచించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళన చేయనున్నట్లు చెప్పారు.

885 పాఠశాలలకు పిఎంశ్రీ గ్రాంట్స్

- **సమగ్రశిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 855 పిఎంశ్రీ పాఠశాలలకు గ్రాంట్ల వినియోగం కింద రూ.8.63 కోట్ల నిధులకు ఆమోదం తెలిపినట్లు సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. ఫేజ్-1 కింద 662 పాఠశాలలకు రూ.667.75 లక్షలు, ఫేజ్-2 కింద 193 పాఠశాలలకు రూ.195 లక్షలు ఆమోదించి నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిఎంశ్రీ పాఠశాలలు విద్యార్థుల అభ్యాసం కొనసాగింపును నిర్ధారించడంతోపాటు, తగినంత సడలింపులతో కూడిన విధానాన్ని పాటించాలని తెలిపారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రతి పాఠశాల నిధుల్లో కనీసం 10 శాతాన్ని నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై దృష్టి సారించాలని వివరించారు. ఈ వార్షిక పాఠశాల నిధులను విద్యుత్ చార్జీల చెల్లింపులు, చాక్స్, డస్టర్స్, చార్టులు, పాఠశాల విద్యా సామాగ్రి (టిఎల్‌ఎం), మరమ్మతులు, పాడైపోయిన పాఠశాల సామాగ్రి, క్రీడా సామాగ్రి, ప్రయోగశాలలు, ఇంటర్నెట్, నీరు వంటి వాటిని మెరుగుపరిచేందుకు వినియోగించాలని సూచించారు.

టిడిపి కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

- **పార్టీ మారడం లేదు : ఆర్‌కె రోజా**

ప్రజాశక్తి -తిరుమల

టిడిపి కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువయ్యిందని మాజీ మంత్రి ఆర్‌కె రోజా విమర్శించారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని.. అదంతా ఊహాగానమే అని తెలిపారు. పార్టీ మారుతున్న వారు ఒకసారి పునరాలోచించుకోవాలని సూచించారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని ఎవరూ క్షమించరన్నారు. ఎంతమంది పార్టీ వీడినా వైసిపికి వచ్చే నష్టమేమీ లేదని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి ఘటనలో చిన్నారి మృతదేహాన్ని ఇంకా కనిపెట్టలేకపోయారని విమర్శించారు. గుడ్లవల్లేరులో ఏం జరగలేదని ఎస్‌పి అనడం దురదృష్టకరమని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై కాకుండా.. మహిళలకు రక్షణ కల్పించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని హితవు పలికారు.



గాజులదిన్నె ప్రాజెక్టు



సాగుతున్న ఆనకట్ట ఎత్తు పెంపు పనులు

తేలని పరిహారం..!

- **80 శాతం పనులు పూర్తయినా ఖరారు కాని పరిహారం**
- **గాజులదిన్నె ఎత్తు పెంపు నిర్వాసితుల ఆందోళన**

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం గాజులదిన్నె జలాశయం (దామోదరం సంజీవయ్య ప్రాజెక్టు) సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా దానివల్ల ముంపునకు గురయ్యే రైతుల పరిహారం మాత్రం ఇంకా తేల్చడం లేదు. ప్రాజెక్ట్ సామర్థ్యం 4.50 టిఎంసిలు కాగా దీన్ని 5.50 టిఎంసిలకు పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2022 మార్చిలో ఆ పనులను ప్రారంభించింది. జలాశయం కాంటూర్ లెవల్ 377.5 మీటర్లు. ఒక టిఎంసి నీటిని అదనంగా నిల్వ చేసేందుకు 378.5 మీటర్లకు ఎత్తును పెంచుతున్నారు. దీని వల్ల గోనెగండ్ల మండలంలోని గోనెగండ్ల, గంపహల్లి, ఐరన్‌బండ, ఎన్నేకండ్ల, నెరడుప్పలతో పాటు దేవనకొండ మండలంలోని పలు గ్రామాల పొలాలు ముంపునకు గురికానున్నాయి. 1300 ఎకరాల్లో 900 ఎకరాలు జలాశయం కట్టినప్పుడు ముంపునకు గురైన భూములు కాగా సామర్థ్యం పెంపు వల్ల అదనంగా 476 ఎకరాలు ముంపునకు గురి కానున్నాయని తేల్చారు. ఈ భూముల పరిహారానికి సంబంధించిన దస్త్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారికి పంపారు. తాజా రెవెన్యూ అధికారులు 300 ఎకరాలకు సంబంధించి సర్వే నిర్వహించారు. మిగతా భూముల్లో కూడా సర్వే నిర్వహించాల్సి ఉంది. ముంపునకు గురవుతున్న భూములకు ఇవ్వాల్సిన పరిహారం గురించి లెక్క తేల్చాల్సి ఉంది. ఇప్పటికే ఎత్తు పెంపు పనులు 80 శాతం పూర్తయ్యాయి. ఈ పనులు ప్రారంభమై రెండేళ్లు గడిచినా పరిహారంపై అడుగులు ముందుకు పడటం లేదు.

ఆ గ్రామాల్లోని భూములు బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలకు పైగా పలుకుతోంది. జలాశయం సామర్థ్యం పెంచుతామంటే స్వాగతిస్తామని, ఆ పేరుతో తమ కడుపులు కొడతామంటే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జలాశయం పక్కనే ఉండడంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో రైతులు బోరు బావుల ద్వారా ఉల్లి, మిరప, పత్తి, వరి వంటి వాణిజ్య, ధాన్యం పంటలు సాగు చేస్తున్నారు. ఎకరా, రెండెకరాలు, మూడెకరాల సాగు భూములు కలిగిన సన్న, చిన్నకారు రైతులే కావడంతో ఆ భూమి పోతే జీవనాధారం కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు.

పరిహారంతో పాటు ఉద్యోగమివ్వాలి

మా నాన్నకు 21 ఎకరాలు ఉండగా గతంలో ప్రాజెక్టు నిర్మించినప్పుడు 18 ఎకరాలు కోల్పోయాం. కేవలం మూడెకరాలే మిగిలింది. ఇప్పుడు ఆనకట్ట ఎత్తును పెంచడం వల్ల ఉన్న మూడెకరాల్లో ఎకరాపైగా పొలం ముంపునకు గురవుతుందని అధికారులు చెబుతున్నారు. ఉన్న మూడెకరాల్లోనూ ఎకరా పోతే కుటుంబ పోషణ కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం భూ పరిహారం ధరను మార్కెట్ రేటు ప్రకారం ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వడంతో పాటు భూములు కోల్పోతున్న రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తే భూ నిర్వాసిత కుటుంబాలకు ఆదుకున్నట్లు ఉంటుంది.

- వి.రాజశేఖర్ రెడ్డి, ఎన్నేకండ్ల, గోనేగండ్ల మండలం.

నివేదిక సమర్పించాల్సి ఉంది

గాజులదిన్నె ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పెంపులో భాగంగా 476 ఎకరాలు వివిధ గ్రామాల పరిధిలో ముంపునకు గురవుతున్నట్లు ప్రాజెక్టు, రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇందులో సుమారు 300 ఎకరాలకు సంబంధించి సర్వే కూడా పూర్తయింది. మిగతా సర్వే కూడా పూర్తిచేసి రెవెన్యూ అధికారులు మునక భూముల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి నివేదిక సమర్పించాల్సి ఉంది. అనంతరం ఆ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ డ్రాఫ్ట్ డిక్లరేషన్‌గా మారి జిల్లా కలెక్టర్ లేదా జిల్లా రెవెన్యూ అధికారులు సంబంధిత రైతులతో మాట్లాడి ధరను నిర్ణయిస్తే భూ పరిహారం అందించే ప్రక్రియ ప్రారంభమవుతుంది.

- విజయకుమార్, గాజులదిన్నె ప్రాజెక్టు డిఇ.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అప్పుల బాధతో ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరులో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు సామిరెడ్డివీధికి చెందిన హరి అనే వ్యక్తి బడ్డీకొట్టు వ్యాపారం చేసేవారు. తేనెబండ ధర్మరాజుల గుడి సమీపంలో ఆయన మృతదేహం ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారమిచ్చారు. అప్పులు పాలవ్వడంతో జీవితంపై విరక్తి చెంది తన శరీరంపై పెట్రోల్ పోసుకుని హరి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరాలపై సమగ్ర సర్వే

- **వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి ప్రజారోగ్య వేదిక లేఖ**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైరల్ జ్వరాల పరిస్థితిని కచ్చితంగా అంచనా వేయడానికి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించాలని ప్రజారోగ్యవేదిక కోరింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి రమణయ్య, టి కామేశ్వరరావు శనివారం లేఖ రాశారు. రాష్ట్రమంతటా డెంగ్యూ, మలేరియా వ్యాధులతోపాటు వైరల్ జ్వరాల వ్యాప్తి కిష్టస్థితికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్ర సర్వే వల్ల వాస్తవ పరిస్థితిని నిర్ధారించడానికి, తగిన చికిత్స అందించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ఫాగింగ్ కార్యకలాపాలను చేపట్టడం చాలా అవసరమని సూచించారు. నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని నివారించడానికి సురక్షితమైన తాగునీటిని అందించడం చాలా అవసరమని తెలిపారు. దీనికి ప్రాధాన్యత ఇచ్చి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో నీటి నిల్వలను తొలగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం ద్వారా ప్రోటీన్ ప్రత్యామ్నాయాలతో సహా పోషకాహారాన్ని అందించాలని కోరారు. అవసరమైన వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని, వ్యాధి తీవ్రత ప్రకారం మందులు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.

శ్రావణ్ షిప్పింగ్‌లో విషవాయువు లీక్

- **ఐదుగురికి అస్వస్థత**

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రయివేటు లిమిటెడ్‌లో శుక్రవారం రాత్రి విషవాయువు లీకై ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను విశాఖ కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ శనివారం పరామర్శించారు. అందిన సమాచారం మేరకు.. ఎసిటానిలైడ్ బ్యాగ్స్‌ను ఒక కంటైనర్ నుంచి మరో కంటైనర్‌కు మారుస్తుండగా వాటిలోని ఒక బ్యాగు చిరిగిపోవడంతో విషవాయువు వెలువడింది. దాన్ని పీల్చడంతో పోతుల కుమారి, గోతిరెడ్డి దేవుడు నాయుడు, గునుపూరు రాము, బొబ్బిలి లక్ష్మి, గంగిరెడ్డి లత అస్వస్థతకు గురయ్యారు. ఈ ఐదుగురినీ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు.



బాధితులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విషయం తెలుసుకున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు ఆస్పత్రికి చేరుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధితులను సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు లోకేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. సరైన భద్రతా చర్యలు లేకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్టు తెలిపారు. కనీసం మాస్కులు కూడా ఇవ్వకుండా కార్మికులతో పనులు చేయిస్తోందని యాజమాన్యంపై మండిపడ్డారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రమాదకర రసాయనం కాదు : యాజమాన్యం

శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రయివేటు లిమిటెడ్ యాజమాన్యం ఈ ఘటనపై ఓ ప్రకటన విడుదల చేసింది. ఎసిటానిలైడ్ జ్వరాన్ని తగ్గించడానికి ఉపయోగించే రసాయనమని, ఇది చైనా నుంచి విర్చొ లేబొరేటరీస్ లిమిటెడ్ ఇండియా ద్వారా 520 సంచులతో కంటైనర్‌లో దిగుమతి అయిందని పేర్కొంది. ఎసిటానిలైడ్ ప్రమాదకర రసాయనం కాదని తెలిపింది. అస్వస్థతకు గురైన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించామని, మెరుగైన చికిత్స అందిస్తున్నామని పేర్కొంది.

ఏడాదిలో నిఫ్టీ 26,820కి చేరొచ్చు

- **పిఎల్ కాపిటల్ అంచనా**

ముంబయి : వచ్చే 12 నెలల కాలంలో నిఫ్టీ 26,820కి చేరొచ్చని బ్రోకరేజి సంస్థ పిఎల్ కాపిటల్ ప్రభుదాస్ లిల్లదర్ అంచనా వేసింది. ప్రస్తుత స్థాయితో పోల్చితే 6 శాతం పెరగొచ్చని పేర్కొంది. ఒకవేళ దీర్ఘకాలంలో పడిపోతే 10 శాతం తగ్గి.. 24,407 వద్ద నమోదు కావొచ్చని తెలిపింది. మార్కెట్లలో దేశీయ పెట్టుబడులు పెరుగుతున్నాయని.. పటిష్టమైన పండుగ సీజన్ డిమాండ్, గ్రామీణ ప్రాంతాలు పుంజుకోవడం, వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశాలు ఉన్నందున స్టాక్ మార్కెట్లకు మద్దతు లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనా వేసింది.

అద్దెకు కియా కార్లు

హైదరాబాద్ : తమ కార్లను కొనుగోలు చేయకుండా అద్దెకు పొందే సౌలభ్యాన్ని కియా కార్స్ అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఎఎల్‌డి ఆటోమోటివ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. దేశంలోని హైదరాబాద్ సహా 14 నగరాల్లో కియా సబ్‌స్క్రైబ్ పేరుతో ఈ సేవలను ప్రారంభించింది. 12-36 నెలల వ్యవధికి కార్లను అద్దెకు తీసుకోవాల్సి ఉంటుంది. సోనెట్‌కు నెలకు రూ.19,999, సెల్టోస్‌కు రూ.23,999, కారెన్స్‌కు రూ.24,999కు చొప్పున వసూలు చేయనున్నట్లు కియా ఇండియా ఉన్నతాధికారి హర్దీప్ సింగ్ బ్రార్ పేర్కొన్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా అద్దె సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు.


నవ్వుతోనూ చెల్లింపులు

- **ఫెడరల్ బ్యాంక్ వెల్లడి**

హైదారబాద్ : భారతదేశంలో తొలిసారిగా ఫేషియల్ పేమెంట్ సిస్టం స్మైల్ పేను ఆవిష్కరించినట్లు ఫెడరల్ బ్యాంక్ తెలిపింది. యుపిఐ చెల్లింపులకు వినూత్నమైన ఫేషియల్ అథెంటికేషన్ టెక్నాలజీతో కెమెరా వైపు చూసి నవ్వితే చాలు.. లావాదేవీ ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తవుతుందని తెలిపింది. భీమ్ ఆధార్ పే ఆధారంగా ఈ టెక్నాలజీ ఉంటుంటుందని వెల్లడించింది. దీన్ని తొలుత పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్లు ఫెడరల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాలినీ వారియర్ తెలిపారు.

ప్రభుత్వ వ్యయం తగ్గడంతోనే మందగింపు

- **జిడిపి పతనంపై ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత**



న్యూఢిల్లీ : ప్రభుత్వ వ్యయాలు తగ్గడం ద్వారానే జిడిపి మందగించిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గరవ్నర్ శక్తికాంతదాస్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత వృద్ధి రేటు 6.7 శాతానికి పరిమితమై 15 నెలల కనిష్టానికి పడిపోవడానికి సార్వత్రిక ఎన్నికల వేళ ప్రభుత్వ వ్యయాలు తగ్గడమేనని పేర్కొన్నారు. శనివారం ఓ కార్యక్రమంలో శక్తికాంత మాట్లాడుతూ.. తొలి త్రైమాసికంలో భారత్ 7.1 శాతం వృద్ధి సాధించనుందని ఆర్‌బిఐ తొలుత అంచనా వేసిందన్నారు. దీనికి భిన్నంగా కేంద్ర గణాంకాల శాఖ కార్యాలయం 6.7 శాతం వృద్ధిని ప్రకటించిందన్నారు. వినియోగం, పెట్టుబడులు, తయారీ, సేవలు, నిర్మాణం వంటి రంగాలు జిడిపి వృద్ధికి ప్రధాన శోధకాలుగా ఉన్నాయన్నారు కాగా.. కేవలం రెండు అంశాలు మాత్రమే వృద్ధి రేటును కొద్దిగా తగ్గించాయన్నారు. అవి ప్రభుత్వ (కేంద్ర మరియు రాష్ట్ర) వ్యయం, వ్యవసాయం అని శక్తికాంత ఎత్తి చూపారు. మొదటి త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం తక్కువగా ఉందని, బహుశా ఎన్నికలు, ఎన్నికల సంఘం మోడల్ ప్రవర్తనా నియమావళిని అమలు చేయడం వల్ల కావచ్చునని పేర్కొన్నారు. "రాబోయే త్రైమాసికాల్లో ప్రభుత్వ వ్యయం పెరుగుతుందని, వృద్ధికి అవసరమైన మద్దతును అందిస్తామని మేము ఆశిస్తున్నాము. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రంగం దాదాపు 2 శాతం కనిష్ట వృద్ధి రేటును నమోదు చేసింది. దేశంలో కొన్ని ప్రాంతాలు మినహా రుతుపవనాలు చాలా బాగా ఉన్నాయి. దీంతో వ్యవసాయ రంగం పట్ల ప్రతి ఒక్కరూ ఆశాజనకంగా, సానుకూలంగా ఉన్నారు." అని శక్తికాంత తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో 2024-25లో 7.2 శాతం వార్షిక వృద్ధి రేటు సాకారం కానుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఐసిఐసిఐ ప్రుడేన్షియల్ రికార్డ్ ఎయుఎం

న్యూఢిల్లీ : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ తమ నిర్వహణలో ఆస్తులు (ఎయుఎం) పరంగా రూ. 3 లక్షల కోట్ల రికార్డ్‌ను నమోదు చేసినట్లు తెలిపింది. 2024 జులై 31 నాటికి రూ.3.14 లక్షల కోట్ల ఎయుఎంను సాధించినట్లు ఆ సంస్థ ఎండి, సిఇఒ అనుప్ బాగ్చి తెలిపారు. ఇది మా ఉత్పత్తులకు కస్టమర్‌లు ఇచ్చే ప్రాధాన్యతను, వారి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి తోడ్పాటు అందిస్తామనే మాపై ఉన్న నమ్మకాన్ని సూచిస్తుందన్నారు 2023-24లో 99.17 శాతం క్లెయిమ్‌లు సెటిల్‌మెంట్ చేశామన్నారు.

నిర్లక్ష్యం వీడండి

- **నూజివీడు ట్రిపుల్ ఐటిలో మంత్రి తనిఖీ**
- **కోలుకుంటున్న విద్యార్థులు**



నూజివీడు ట్రిపుల్ ఐటి కిచెన్ నిర్వాహకులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడుతోంది. మంత్రి కొలుసు పార్థసారధి మరోసారి ట్రిపుల్ ఐటి క్యాంపస్‌ను తనిఖీ చేశారు. తాజాగా శనివారం 48 మంది అస్వస్థతకు గురవ్వగా వారిలో 47 మంది ఓపిలో చికిత్స పొందారు. మరొకరు డయేరియాతో ఇన్‌పేషెంట్‌గా చేరారు. అయితే సదరు విద్యార్థి కూడా కోలుకోవడంతో శనివారం సాయంత్రం డిశ్చార్జి చేశామని డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు. మొత్తంగా వారం రోజుల్లో 11 వందల మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా ఎవరూ చికిత్స పొందడం లేదు.

మెస్‌ల నిర్వహణ మెరుగుపర్చాలి : మంత్రి

క్యాంపస్ మెస్‌ల నిర్వహణ మెరుగుపర్చాలని మంత్రి పార్థసారధి సూచించారు. నిర్లక్ష్యం వీడి విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అధికారులు, మెస్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం ఉదయమే ఆయన నేరుగా క్యాంపస్‌లోని మెస్ వద్దకు చేరుకుని విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. మెరుగైన నీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. త్వరలో అన్నింటినీ ప్రక్షాళన చేసి ట్రిపుల్ ఐటికి పూర్వ వైభవం తీసుకువస్తామని తెలిపారు.



పెండ్లిమర్రిలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండండి

- **వైసిపి శ్రేణులకు వైఎస్.జగన్ భరోసా**

ప్రజాశక్తి-వేంపల్లె/పులివెందుల టౌన్

వైసిపి శ్రేణులు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల కడప జిల్లా పర్యటనలో భాగంగా శనివారం బెంగళూరు నుండి కడప ఎయిర్ పోర్ట్‌కు ప్రత్యేక విమానంలో వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పెండ్లిమర్రి మండలం మాచునూరు గ్రామానికి వెళ్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాచునూరు సర్పంచ్, మండల కన్వీనర్ మాచునూరు చంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాచునూరుకు జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో ప్రజలు, వైసిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఆయనతో కరచాలం చేసేందుకు ఎగబడ్డారు. పార్టీ శ్రేణులతో కాసేపు ఆయన ముచ్చటించారు. అనంతరం అక్కడి నుంచి గొందిపల్లెకు చేరుకుని ఇటీవల వివాహం జరిగిన కడప మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ చంద్రహసరెడ్డి కుమార్తె ఆశారెడ్డి దంపతులను ఆశీర్వాదించారు. ఆ తర్వాత పులివెందులకు చేరుకున్నారు. జగన్‌ను స్వాగతం పలికిన వారిలో కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, ముత్యాల ఆంజనేయులు, కమతం రాజా, మైనార్టీ నేత షెక్షావలి, వైసిపి నేతలు ఉన్నారు. జగన్ శనివారం రాత్రికి పులివెందులలోని తన ఇంట్లో బస చేశారు.



అరకులోయ ఆసుపత్రిలో విద్యార్థినిని పరామర్శిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

విద్యార్థులకు నాసిరకం భోజనం పెడతారా?

- **కలుషిత ఆహార ఘటనపై కలెక్టర్ సీరియస్**

ప్రజాశక్తి - దుంబ్రిగుడ, అరకులోయ (అల్లూరి జిల్లా)

'వారంతా పిల్లలనుకుంటున్నారా ? పశువులనుకుంటున్నారా ?. మీ పిల్లలకైతే ఇలాగే నాసిరకం భోజనం పెడతారా ? అంటూ అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండలంలోని జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మేట్రిన్, డిడిలను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రశ్నించారు. శనివారం ఉదయం పిల్లలకు వండిపెట్టిన పులిహోర నాసిరకంగా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అరకు ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులందరూ కోలుకుంటున్నారని మీడియాకు ఆయన తెలిపారు. అస్వస్థతకు గురైన 61 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తరలించామని, మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా ఉన్నారు.



మున్సిపల్ సమావేశంలో కలబడుతున్న కమిషనర్, డిఇ

కౌన్సిల్ సమావేశంలో అధికారుల కొట్లాట

- **కాకినాడ జిల్లా పిఠాపురంలో ఘటన**

ప్రజాశక్తి - పిఠాపురం(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో అధికారులు కొట్లాటకు దిగారు. కౌన్సిల్ సభ్యులు ఎదుటే మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, డిప్యూటీ ఇంజినీర్ భవానిశంకర్ బాహాబాహీకి దిగడం విస్మయానికి గురిచేసింది. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్‌పర్సన్ పి.జ్యోతి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల విషయంపై కౌన్సిలర్ బోను నానిబాబు మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ వివరణ ఇచ్చారు. డిఇ అందుబాటులో ఉండడం లేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇఇ సాయంతో పనులు చేయిస్తున్నానని తెలిపారు. ఎన్నికల సమయంలోనూ ఆయన సెలవుపై వెళ్లిపోయారన్నారు. కమిషనర్ మాట్లాడుతుండగానే డిఇ కలుగజేసుకుని మాట్లాడారు. కమిషనర్ చెప్పేవన్నీ అసత్యాలని, అనారోగ్య సమస్యల వల్ల సెలవుపై వెళ్లానని తెలిపారు. అనంతరం విధులకు హాజరైతే అడ్డుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో తాను కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నానని తెలిపారు. దీంతో ఇరువురి మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. ఇది కాస్తా వ్యక్తిగత దూషణలకు దారితీసింది. ఒకానొక దశలో నియంత్రణ కోల్పోయి ఒకరిపై ఒకరు కొట్లాటకు దిగారు. కౌన్సిల్, మున్సిపల్ సిబ్బంది ఇరువురిని విడదీసి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఆర్‌డి నరసింహారావు, కాకినాడ ఆర్‌డిఒ కిశోర్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. శాఖా పరమైన విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కమిషనర్, డిఇ నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకుంటామని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు.

సంపాదకీయం

క్షమాపణ

జీవితంలో కొన్నిసార్లు తప్పులు, పొరబాట్లు సహజం. పశ్చాత్తాపపడే సందర్భాలూ ఎదురవుతాయి. అలాంటప్పుడు మన పశ్చాత్తాపాన్ని వ్యక్తీకరించే శక్తివంతమైన సాధనం క్షమాపణ. ఎదుటివారితో మూర్ఖంగా ప్రవర్తించినప్పుడో, వారికి నష్టం కలిగించినప్పుడో పశ్చాత్తాపపడతాం...క్షమాపణలు కోరతాం. ఆ క్షమాపణ హృదయపూర్వకంగా వుండాలి. ఆ భావన గుండె లోతుల్లోంచి రావాలి. కానీ, పదేపదే తప్పులు చేస్తూ...క్షమాపణలు కోరుతుంటే, దానికి విలువ, నమ్మకం వుండవు. 'క్షమాపణ అంటే-కొత్త ఆరంభం కోసం మరొక అవకాశం' అంటారు దక్షిణాఫ్రికా ఆంగ్లికన్ బిషప్ డెస్మండ్ టుటు. నమ్మకం దారుణంగా దెబ్బతిన్న చోట క్షమాపణకు అర్థం వుండదు. 'అతిగా క్షమాపణలు చెప్పడం నాయకుల నిజాయితీని ప్రశ్నార్థకం చేస్తుంది' అంటారు ఐరిస్ సాఫ్ట్‌వేర్ సంస్థ యజమాని శరద్ వర్మ.

ప్రధాని నరేంద్రమోడీ శివాజీ విగ్రహాన్ని ప్రారంభించిన తొమ్మిది నెలల్లోనే కూలిపోయిన ఉదంతంపై క్షమాపణలు చెప్పారు. అదే సందర్భంలో...కొంతమంది వీర సావర్కర్‌ను సైతం అవమానిస్తూ వుంటారని, అందుకు వారు క్షమాపణలు మాత్రం కోరరు' అని విమర్శించారు. సావర్కర్‌ను స్వాతంత్ర్య సమరయోధుల జాబితాలో నిలపాలన్న ఆయన తాపత్రయం, నేను కాబట్టి క్షమాపణలు చెప్పాను అన్న అతిశయం కనిపిస్తోంది తప్ప...పశ్చాత్తాపంతో క్షమాపణలు చెప్పినట్లుగా లేదు. గతేడాది ఎన్నికల ముందు హడావుడిగా శివాజీ విగ్రహం పెట్టి లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. మళ్లీ ఇప్పుడు మహారాష్ట్రతో సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు రాబోతున్న సమయంలో విగ్రహం కూలిపోవడంతో తప్పనిసరై క్షమాపణలు చెప్పినట్లుగా కనిపిస్తోంది. గతంలోను పలుమార్లు క్షమాపణలు చెప్పిన సందర్భాలున్నాయి. రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తెచ్చిన సందర్భంలో 'రైతులను ఒప్పించలేకపోయాను...క్షమించండి' అంటూ ఆ చట్టాలను విరమించుకున్నారు. కాని, వాటి సారాంశాన్ని దొడ్డిదారిన అమలుకు పూనుకుంటున్నారు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్ విధించినందుకు క్షమాపణలు కోరారు. ఢిల్లీలో జరిగిన జి-20 సదస్సు వల్ల అక్కడి ప్రజలకు ఇబ్బంది కలిగిందని క్షమాపణలు కోరారు. ప్రజలకు జరిగిన నష్టానికి ఏనాడూ క్షమాపణలు చెప్పని మోడీ...ఇప్పుడు చెప్పడం మొసలి కన్నీరులా కనిపిస్తున్నది. నిజానికి మోడీ క్షమాపణలు చెప్పాల్సి వస్తే... చాలా వాటికి చెప్పాలి. ఆరడుగుల శివాజీ విగ్రహానికి మాత్రమే అనుమతి వుంటే, 35 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి, రూ.2.44 కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం చేసినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఢిల్లీ చుట్టూ వేలాది రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నెలల తరబడి ఆందోళన చేసినా 'రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి'లా మౌనంగానే వున్నారే తప్ప ఒక్క మాటా పలకలేదు. నోట్ల రద్దు వల్ల దేశ ప్రజలంతా ఇబ్బందులు పడ్డారు. అనేకమంది చనిపోయారు. మణిపూర్‌లో మారణహోమం జరుగుతున్నా, మహిళను వివస్త్రను చేసి రోడ్డుపై పరుగులెత్తించారు. మైనారిటీలపై అనేక మూకదాడులు జరిగినా, 'లైంగిక వేధింపులకు గురవుతున్నాం..కాపాడండని రెజ్లర్లు నిరసన దీక్ష చేసినా... నిర్భయ నుంచి కోల్‌కతాలో జరిగిన అభయ ఘటన వరకు మోడీ చాలా వాటికి క్షమాపణలు చెప్పాలి.

మన ప్రవర్తన తప్పు అని గ్రహించినప్పుడు పశ్చాత్తాపపడటం, క్షమాపణ చెప్పడం నిజాయితీకి నిదర్శనం. తప్పు చేసినప్పుడు క్షమాపణ చెప్పడం నేర్చుకోవడం, అతిగా క్షమాపణ చెప్పడం మానుకోవడం నాయకత్వ లక్షణాన్ని మెరుగు పరుస్తుంది. అంతేగాని, జవాబుదారీ తనాన్ని విస్మరించేదిగా వుండకూడదు. 'తప్పు చేస్తున్న వాళ్ల చరిత్రలు పవిత్రమైతే, తప్పు చెల్లించేందుకేబాధా లేదు' అంటారు రచయిత సాధు సుబ్రహ్మణ్య శర్మ. ఏ రంగంలోనైనా పొరబాటు నిర్ణయం తీసుకున్నప్పుడు హృదయపూర్వకంగా క్షమాపణలు చెప్పడం అంటే...బాధ్యతాయుతమైన నాయకత్వ పటిమను నిరూపిస్తుంది. చిత్తశుద్ధి లోపించినప్పుడు ఒకే మాట ఎన్నిసార్లు చెప్పినా... దానికి విలువ వుండదు.

మహనీయుల మాట




కమ్యూనిస్టు కార్యకర్తలు అధ్యయనం, ఆచరణ ద్వారా నిరంతరం తమ రాజకీయ, సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవడానికి ప్రయత్నించడం అవసరం.

- పుచ్చలపల్లి సుందరయ్య

హర్యానాలో హోరాహోరీ సమరమేనా?

ప్రస్తుతం

హర్యానా శాసనసభ ఎన్నికలు అక్టోబరు ఐదవ తేదీన ఒకే విడతగా జరగనున్నాయి. సెప్టెంబరు 16తో నామినేషన్ల చివరి దశ ముగుస్తుంది. కేంద్రంలో మూడోసారి మూలు గుతూ అధికారానికి వచ్చిన బిజెపి ఇక్కడ కూడా మూడోసారి ఎలాగైనా అధికారం నిలుపుకోవాలని నానా తంటాలు పడుతుంటే కాంగ్రెస్ కూడా అంతే ఆశతో వ్యూహాలు రచిస్తున్నది. ఏమంటే మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో ఈ రాష్ట్రంలో వున్న పది స్థానాలలో ఇరు పార్టీలకూ సమానంగా చెరి అయిదు వచ్చాయి. అటూ ఇటూ కలుస్తూ అధికారంపై ప్రభావం చూపుతున్న ప్రాంతీయ పార్టీలు మనుగడ కాపాడుకునే పరిస్థితిలో పడిపోయాయి. ఆ విధంగా చూస్తే హిందీ రాష్ట్రాలలో హర్యానాది ప్రత్యేక పరిస్థితి. ఇక్కడ ప్రధాన పోటీ రెండు జాతీయ పార్టీల మధ్యనే జరుగుతున్నా ప్రాంతీయ పార్టీల ప్రభావాన్ని కాదనడానికి వుండదు. అలా అవే చక్రం తిప్పడమూ జరగదు. దేశ రాజధానికి దగ్గరగా వుంటూ ఢిల్లీని అమితంగా ప్రభావితం చేసే హర్యానాలో బిజెపి హిందూత్వ ప్రభావం కన్నా రాజకీయ వ్యూహాలతోనే ఎక్కువగా పట్టు సాధించగలిగింది. ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే మధ్య మధ్య విరామాలతో వారు ప్రధాన శక్తిగా కొనసాగుతున్నారు. గతంలో కాంగ్రెస్‌లోనో లేక అప్పటి జనతా జనతాదళ్ వంటి పార్టీలతోనో వుండి అధికారం పోయాక ప్రాంతీయ పార్టీలు పెట్టుకున్న రాజకీయ కుటుంబాలు ప్రాబల్యం సాగిస్తుంటాయి. వాటాను పొందుతుంటాయి. హర్యానా వికాస్ పార్టీ, ఇండియన్ యూనియన్ లోక్‌దళ్, జననాయక్ జనతా పార్టీ (జెజెపి) వంటివి ఆ విధంగా చెప్పుకోదగినవి. ఓం ప్రకాశ్ చౌతాలా, దుష్యంత్ చౌతాలాలతో కూడిన మాజీ ఉపప్రధాని దేవీలాల్ కుటుంబం, బన్సీలాల్, దీపేందర్ హుడా, రావు బీరేంద్ర సింగ్‌ల కుటుంబాలు అక్కడ రాజకీయాలలో కీలక స్థానమాక్రమించి నడిపిస్తూ వచ్చాయి. వారి మధ్యనే ముఖ్యమంత్రి పీఠం అటూ ఇటూ మారుతూ వచ్చింది. కానీ గత పదేళ్లలో మాత్రం బిజెపి పాలనలోనే కొనసాగింది. ఆర్థిక సామాజిక నేపథ్యంలో చూసినా హర్యానా రాజకీయాలలో జాట్ ప్రాబల్యం ఒక కీలకాంశంగా వుంటుంది. పంజాబ్ నుంచి విడిపోయిన హర్యానాకు అక్కడి రాజకీయాలతో ఏ మాత్రం పోలిక వుండదు. కానీ రైతు ఉద్యమంలో మాత్రం ప్రధాన పాత్ర పోషించింది. బడా వాణిజ్య వర్గాలు, భూస్వామ్య వర్గాలు కూడా హర్యానాలో ఏక కాలంలో పట్టు కలిగి వుండటం విశేషం.



తెలకపల్లి రవి

బిజెపి వ్యూహాత్మక రాజకీయం

పదేళ్లుగా హర్యానాను బిజెపి పాలిస్తున్నా సంప్రదాయికంగా ఇది వారి కంచు కోట కాదు. 1977 జనతా ప్రయోగం తర్వాత కూడా జనతా, జనతా దళ్ (సమతా) లేదా ఆ నాయకులు ఏర్పాటు చేసిన ప్రాంతీయ పార్టీలే నిర్ణాయక పాత్ర పోషిస్తూ వచ్చాయి. 1996లో ఇన్‌చార్జిగా వచ్చిన నరేంద్ర మోడీ బన్సీలాల్ హర్యానా వికాస్ పార్టీతో కలసి మొదటి సారి అధికారంలో భాగం వచ్చేలా చేశారు. అయినా తర్వాత మళ్లీ 2000లో బిజెపికి ఆరు, 2005లో రెండు స్థానాలే దక్కాయి. 2000లో ఓం ప్రకాశ్ చౌతాలా ఐ.ఎన్.ఎల్.డి తరపున 47 స్థానాలతో ముఖ్యమంత్రి కాగా తర్వాతి రెండు పర్యాయాలు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా భూపేందర్ సింగ్ హుడా కొనసాగారు. 2014, 2019లో బిజెపి కొనసాగింది. దేవీలాల్ కుటుంబం నుంచి చీలిపోయిన దుష్యంత్ చౌతాలా ఐ.ఎన్.ఎల్.డి కి పోటీగానే జె.జె.పి ని ఏర్పాటు చేశారు. అయితే గత పర్యాయం అవసరమైన మెజార్టీ రాకపోవడంతో దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జె.జె.పి తో చేతులు కలపాల్సి వచ్చింది. తగు గౌరవం ఇవ్వలేదనే కారణంతో జెజెపి 2024 ఎన్నికలకు ముందే ప్రభుత్వం నుంచి వైదొలగ్గా ఇండిపెండెంట్ల సహాయంతో నెట్టుకు వస్తున్నారు. అయితే తీరా ఆ ఎన్నికల ప్రాంగణంలో అప్పటిదాకా ముఖ్య మంత్రిగా వున్న మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తొలగించి నయాబ్ సింగ్ సైనీని నియమించింది బిజెపి అధిష్టానం.

వ్యతిరేకతకు కారణాలు

ఇన్ని మార్పులు చేసినా లోక్‌సభ ఎన్నికల నాటికి బిజెపి తీవ్ర అసంతృప్తిని ఎదుర్కోవలసి వచ్చింది. దేశవ్యాపితంగా సాగిన రైతు ఉద్యమంలో హర్యానా రైతులు ఒక ముఖ్య పాత్ర పోషించారు.



లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్, బిజెపి చెరి అయిదు స్థానాలు తెచ్చుకున్నా 'ఇండియా' బ్లాక్ లోని కాంగ్రెస్, ఆప్‌లకు కలిపి చూస్తే 46 (42+4) అసెంబ్లీ విభాగాల్లో మెజార్టీ వచ్చినట్టయింది. బిజెపి 44 స్థానాల్లో ఆధిక్యత తెచ్చుకోగలిగింది. దీనికి తోడు జాతీయ స్థాయిలోనూ బిజెపి ఆధిక్యత తెచ్చుకోలేక మిత్రపక్షాల మద్దతుపై ఆధారపడవలసిన పరిస్థితి రాష్ట్రంపైనా ఇప్పుడు మరింత ప్రభావం చూపుతుంది. ఇదే సమయంలో యువతకు ఉద్యోగ భద్రత కల్పించడంపై ఏకంగా ఆర్డినెన్సునే జారీ చేశారంటే ఎంత ఆందోళనగా వున్నదీ విదితమవుతుంది. బిసీ తరగతుల క్రీమీ లేయర్ ఆదాయ పరిమితి పెంపు, పొలాలతో వచ్చే ఆదాయం పైన పన్ను వుండదనే హామీ ఇలా వరస ఉత్తర్వులతో ఓట్లు రాబట్టడానికి బిజెపి తంటాలు పడుతున్నా పరిస్థితి గడ్డుగానే వుంటోంది. రెజ్లర్ వినేష్ ఫోగాట్ ఉదంతం కూడా ఆ పార్టీపై విముఖత పెంచింది. బిజెపి ఆత్మ విశ్వాసాన్ని ఇది ఎంతగా దెబ్బ తీసిందంటే ఎన్నికల తేదీలే వాయిదా వేయాలని వారు ఎన్నికల సంఘాన్ని కోరేవరకూ వెళ్లారు.

కనీస మద్దతు ధర నిర్ణయంలో నిర్లక్ష్యం ఈ రాష్ట్రంపై చాలా ప్రభావం చూపింది. ఆ సందర్భంగా సాగిన నిర్బంధం, కర్నాల్ చెక్‌పోస్టు వద్ద ఘటనలు దేశమంతా సంచలనం కలిగించాయి. ఫసల్ బీమా కింద సహాయం కోసం రైతులు ఈ అకౌంట్లు తెరవాలని హడావుడి చేసినా ఆచరణలో ఫలితం లేకపోయింది. నిరుద్యోగ సమస్య తీవ్రంగా వుండగా అగ్నిపథ్ పథకం కింద తాత్కాలిక సైనిక నియామకాల విధానం కూడా నిరసనకు గురైంది. రెండు లక్షల ప్రభుత్వోద్యోగాలు ఖాళీగా వున్నా నియామకం చేపట్టలేదు. కాంగ్రెస్ సగం సీట్లు తెచ్చుకోగలిగింది. 2019 ఎన్నికలలో ఆప్ ఇక్కడ అన్ని స్థానాలకు పోటీ చేయడంతో ఓట్లు చీలిపోవడం బిజెపికి మేలు చేసింది. లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్, బిజెపి చెరి అయిదు స్థానాలు తెచ్చుకున్నా 'ఇండియా' బ్లాక్ లోని కాంగ్రెస్, ఆప్‌లకు కలిపి చూస్తే 46 (42+4) అసెంబ్లీ విభాగాల్లో మెజార్టీ వచ్చినట్టయింది. బిజెపి 44 స్థానాల్లో ఆధిక్యత తెచ్చుకోగలిగింది. దీనికి తోడు జాతీయ స్థాయిలోనూ బిజెపి ఆధిక్యత తెచ్చుకోలేక మిత్రపక్షాల మద్దతుపై ఆధారపడవలసిన పరిస్థితి రాష్ట్రంపైనా ఇప్పుడు మరింత ప్రభావం చూపుతుంది. ఇదే సమయంలో యువతకు ఉద్యోగ భద్రత కల్పించడంపై ఏకంగా ఆర్డినెన్సునే జారీ చేశారంటే ఎంత ఆందోళనగా వున్నదీ విదితమవుతుంది. బిసీ తరగతుల క్రీమీ లేయర్ ఆదాయ పరిమితి పెంపు, పొలాలతో వచ్చే ఆదాయం పైన పన్ను వుండదనే హామీ ఇలా వరస ఉత్తర్వులతో ఓట్లు రాబట్టడానికి బిజెపి తంటాలు పడుతున్నా పరిస్థితి గడ్డుగానే వుంటోంది. రెజ్లర్ వినేష్ ఫోగాట్ ఉదంతం కూడా విముఖత పెంచింది. బిజెపి ఆత్మ విశ్వాసాన్ని ఇది ఎంతగా దెబ్బ తీసిందంటే ఎన్నికల తేదీలే వాయిదా వేయాలని వారు ఎన్నికల సంఘాన్ని కోరేవరకూ వెళ్లారు. ఎన్నికల ప్రకటన తర్వాత బిజెపి నాయకత్వం అమిత్ షా ధర్మేంద్ర ప్రధాన్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి వారు అభ్యర్థులను ఖరారు చేసేందుకు కసరత్తులు చేసినా ఆరెస్సెస్ మాత్రం సగం మంది అభ్యర్థులను మార్చాల్సిందేనని హుకుం జారీ చేసింది. గత తప్పిదాలను దిద్దుకోవడానికి అవస్థలు పడుతుంటే కంగనా రనౌత్ రైతు ఉద్యమాన్ని కఠినంగా అణచివేసి వుండాల్సిందని నోరు పారేసుకోవడం మరింత దెబ్బగా పరిణమించింది. ఆ భయంతోనే కేంద్ర నాయకత్వం ఆగమేఘాల మీద రంగంలోకి దిగి ఖండించవలసి వచ్చింది. అయినా నష్టం తప్పడం లేదు. పైగా ఆమె తర్వాత అదే ధోరణిలో మాట్లాడుతున్నారు కూడా.

కాంగ్రెస్ అనైక్యత

ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే అనైక్యత షరా మామూలు సమస్యే. అందులోనూ కాస్త అనుకూల వాతా వరణం కనిపించడంతో తగాదాలు మరింత ముదురు పాకాన పడుతున్నాయి. భూపేందర్ సింగ్ హుడా, ఆయన కుమారుడు దీపేందర్ సింగ్ హుడా, కోడలు ప్రేమలత, మాజీ కేంద్రమంత్రి సెల్జా, సీనియర్ నాయకుడు రణదీప్ సింగ్ సూర్జేవాలా వంటి వారు తమ తమ ఆధిపత్యాల కోసం పెనుగులాడుతున్నారు. ఇదే చాలక బిజెపిలోకి వెళ్లిన మాజీ మంత్రి రావు బీరేంద్ర సింగ్ ఆయన కుమారుడు బ్రిజేంద్ర సింగ్ కాంగ్రెస్ లోకి తిరిగి వచ్చి పోటీ పడుతున్నారు. వీరిలో సెల్జా, దీపేందర్ సింగ్, బ్రిజేంద్ర సింగ్ వంటి వారు మొన్ననే పార్లమెంటుకు ఎన్నికైనారు. దాంతో కాంగ్రెస్ అధిష్టానం పార్లమెంటు సభ్యులెవరూ శాసనసభ పోటీలో వుండబోరని స్పష్టం చేసింది. 'ఇండియా' బ్లాక్ అంటున్నా కాంగ్రెస్‌కు ఎవరితో పొత్తు లేదు. పక్కనే పంజాబ్‌ను పాలిస్తున్న ఆప్ సరిహద్దులలో వున్న 28 సీట్లపై కేంద్రీకరిస్తుందని చెబుతున్నారు. ఒపీనియన్ పోల్స్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యత కనిపిస్తున్నా కొన్ని బిజెపికీ మొగ్గ చూపిస్తున్నాయి. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల తర్వాత దృశ్యం మారిందనే సంకేతం ఇవ్వడానికి ప్రయత్ని స్తున్నాయి. వీటిని గమనించిన కాంగ్రెస్ నాయకత్వం ఐక్యతను పెంచడానికి, తామే విజేతలమన్న భావం బలోపేతం చేయడానికి నడుం కట్టింది. మరింత మంది పరిశీలకులను నియోగిస్తోంది. వాస్తవానికి మొన్నటి పార్లమెంటు ఎన్నికలలో జాట్ ఆధిక్యత వున్న హిస్సార్, సోనేపట్, సిర్సా, రోహ్తక్ వంటి చోట్ల, రైతు ఉద్యమం బలంగా సాగిన అంబాలాలో కాంగ్రెస్ గెలుపొందడం సామాజిక సమీకరణల సంకేతాలు మార్చింది. కర్నాల్, కురుక్షేత్ర, బివానీ, గుర్గావ్, ఫరీదాబాద్ వంటి చోట్ల కూడా ప్రజల్లో అసంతృప్తి వున్నా బిజెపి లోక్‌సభ స్థానాలు తెచ్చుకుంది.

ప్రాంతీయుల ప్రభావమెంత?

ఈ విధంగా కాంగ్రెస్ బిజెపిల మధ్య హోరాహోరీ పోరాటంగా వుంటే ప్రాంతీయ పార్టీల మనుగడ మరో సవాలుగా మారింది. పైనే చెప్పుకున్నట్టు ఈ రెండు పార్టీల మధ్యన గతంలో రాష్ట్రాన్ని పాలించిన నేపథ్యం వాటికి వుంది. అయితే మొన్నటి లోక్‌సభ ఎన్నికల దెబ్బతో అవి ఒక్కసారిగా కుదేలైపోయాయి. ఈ పార్టీలే పొత్తులకు కూడా సిద్ధమవడానికి కారణమదే. బిఎస్‌పితో ఐ.ఎన్.ఎల్.డి జట్టు కట్టింది. మాయావతి నుంచి విడిపోయిన చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని బిఎస్పీ (కాన్షీరాం) వర్గం జెజెపితో పొత్తు పెట్టుకుంది. గతంలో బిఎస్‌పికి స్థానాలు వచ్చిన ఉదాహరణలున్నాయి. జనాభా పరంగా కూడా జాట్‌లు 25 శాతం అయితే దళితులు 20 శాతం వున్నారు. మొత్తం 17 రిజర్వుడు స్థానాలున్నాయి. 2019లో పది స్థానాలు తెచ్చుకున్న జెజెపి జట్టు కట్టిన బిజెపి ఇప్పుడు దూరం కావడం ఇతర వర్గాలలో పట్టు పెంచుకోవడమే. ఆ పార్టీ తరపున గెలిచిన పది మందిలో ముగ్గురే మిగలగా తక్కిన వారు కాంగ్రెస్, బిజెపిలలో కలసిపోయారు. లోక్‌సభ ఎన్నికలలో ఒక్క శాతం ఓట్లు కూడా రాని స్థితి. బిజెపిపై వ్యతిరేకత తమను దెబ్బ తీసిందని జెజెపి భావనగా వుంది. వీటన్నిటి అంతిమ ఫలితం ఏమిటో చూడవలసిందే. ప్రజాస్వామ్య లౌకిక విలువలు రాష్ట్రాల హక్కుల కోసం గట్టిగా నిలబడకపోతే ప్రాంతీయ పార్టీల అవకాశవాద పోకడలు వాటి అస్తిత్వానికే ముప్పు తెస్తాయనే వాస్తవాన్ని కూడా హర్యానా అనుభవం చెబుతున్నది. జెజెపి మద్దతు తీసుకుని కూడా నిష్కర్షగా గెంటివేసిన బిజెపి తీరు వాటికి ఒక హెచ్చరికగానూ వుంటుంది. మొత్తంపైన సర్వేలు, లోక్‌సభ ఫలితాల తీరు చూస్తే ఇక్కడ బిజెపి ఎదురుదెబ్బ తింటుందన్న పరిశీలకుల భావన నిజమయ్యే అవకాశమే ఎక్కువ.

◆

వ్యాఖ్య

కంగన నోటి దురుసు!

సత్య

> **తోటకూర నాడే మందలించి ఉంటే అనే సామెత తెలిసిందే. గతంలో కంగనా రనౌత్ చేసిన అనేక వివాదాస్పద ప్రకటనలు, ప్రత్యర్థులపై ఎదురు దాడికి దిగినపుడు బిజెపి నోరు మెదపలేదు. దాడి జరపటాన్ని ఆస్వాదించింది. పరిస్థితి మారిన తరువాత ఇప్పుడు ప్రతి మాట వల్లా పార్టీకి ఎదురు దెబ్బ తగులుతోంది. అయినా సరే. ఆమె ఎక్కడా తగ్గటం లేదు. తన సినిమా గురించి ప్రచారం చేసుకుంటూ చౌకబారు, తెలివి తక్కువ ప్రకటనలు, వివాదాస్పద వ్యాఖ్యలతో ఉచిత ప్రచారం పొందాలని చూస్తున్నట్లు కనిపిస్తున్నది.**


నోటి దురుసు సెలబ్రిటీగా పేరు మోసిన నటి కంగనా రనౌత్ ఇందిరా గాంధీ పాత్రలో నటించి, దర్శకురాలిగా ఉన్న 'ఎమర్జన్సీ' సినిమా బిజెపికి తలనొప్పిగా మారింది. చరిత్రను వక్రీకరించటమే గాక తమను దేశద్రోహులు, ఉగ్రవాదులుగా చిత్రీకరించారని, అది తమపై విద్వేషాన్ని రెచ్చగొట్టే అవకాశం ఉన్నందున ఆ చిత్రంపై నిషేధం విధించాలంటూ దేశవ్యాపితంగా సిక్కులు డిమాండ్ చేస్తున్నారు. ఖలిస్తాన్ మద్దతుదార్లు కంగనను చంపివేస్తామంటూ బెదిరింపులకు దిగారని వార్తలు. దీంతో 2024 సెప్టెంబరు ఆరున విడుదల తేదీని ప్రకటించిన కంగన ఇప్పుడు దానికి సెన్సార్ బోర్డు ఆమోదం తెలిపినా కొందరి ఒత్తిడి కారణంగా ధృవీకరణ పత్రం నిలిపివేశారని చెబుతున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం, ఆమె ప్రధానిగా ఉన్నపుడు 21 నెలల అత్యవసర పరిస్థితి విధింపు తదితర అంశాల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 14వ తేదీన ట్రైలర్‌ను విడుదల చేయగా 50 లక్షల మంది చూశారని, కేవలం 461 మంది మాత్రమే ఇష్టపడినట్లు నమోదైనట్లు 'ఇండియా టుడే' పేర్కొన్నది. ప్రతి ఒక్క ఓటునూ లెక్కించుకుంటున్న బిజెపికి ఇప్పటికే దేశంలో ఉన్న మూడు కోట్ల మంది సిక్కులు వ్యతిరేకంగా ఉన్నారు. ఈ సినిమాతో వారు మరింత దూరమౌతారని, పక్కా వ్యతిరేకులుగా మారతారని ఆ పార్టీ భయపడుతోంది. అక్టోబరులో జరిగే హర్యానా, కాశ్మీరు ఎన్నికలపై ప్రతికూల ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. గతంలో బిజెపి మిత్రపక్షంగా ఉన్న అకాలీదళ్ కూడా అదే డిమాండ్ చేసింది.

బిజెపి ఎంపీ కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలకు పేరుమోసిన సంగతి తెలిసిందే. రైతుల గురించి నోరు పారవేసుకున్న ఉదంతం సమసిపోక మందే కులగణన గురించి చేసిన వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని బిజెపి చెప్పుకుంది. ఆ పార్టీలో ఇలాంటి వారికి కొదవలేదు. అవి పార్టీ కొంప ముంచుతున్నాయి.

ఆగస్టు చివరి వారంలో దైనిక్ భాస్కర్ అనే పత్రికతో మాట్లాడిన కంగన 2020-21లో జరిగిన రైతు ఉద్యమం గురించి నోరు పారవేసుకున్నారు. ఆ సందర్భంగా మృతదేహాలు వేలాడాయని, మానభంగాలు జరిగాయని ఆరోపించారు. రైతు ఉద్యమం జరిగిన హర్యానాలో లోక్‌సభ ఎన్నికల్లో పదికి గాను ఐదు సీట్లు పోగొట్టుకున్న బిజెపి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దూరం కానుందనే భయంతో ఉంది. సరిగ్గా ఈ తరుణంలో ఆమె చేసిన వ్యాఖ్యలు హర్యానా రైతాంగాన్ని మరింతగా రెచ్చగొట్టేవే. పార్టీకి నష్టం కలిగిస్తాయని హర్యానా పార్టీ నేతలు గగ్గోలు పెట్టారు. దాంతో కేంద్ర బిజెపి వెంటనే కంగన మాటలతో పార్టీకి సంబంధం లేదని చెప్పుకుంది తప్ప కనీసంగా ఆమెను మందలించలేదు. బంగ్లాదేశ్‌లో మాదిరి పరిస్థితిని భారత్‌లో సృష్టించే పథకం ఉందని, రైతుల నిరసనల వెనుక చైనా, అమెరికా హస్తం ఉందని కూడా అంతకు ముందు ఆరోపించారు. పార్టీ విధానాల గురించి ప్రకటనలు చేసేందుకు కంగనా రనౌత్‌కు అధికారం లేదా అనుమతి ఇవ్వలేదని, భవిష్యత్‌లో అలాంటి ప్రకటనలు చేయకూడదని కోరినట్లు బిజెపి ప్రకటించింది. తాను నటించిన ఎమర్జన్సీ సినిమా గురించి ప్రచారం చేసుకొనేందుకు దైనిక భాస్కర్ పత్రికతో మాట్లాడినపుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అందరూ వాటిని ఎక్కడ చదవరనో లేదా మరింత ప్రచారం కోసమో సదరు పత్రిక వార్తను తన ఎక్స్ ఖాతాలో ఆగస్టు 25న పోస్టు కూడా చేశారు. లోక్‌సభ ఎన్నికలపుడు హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను బిజెపి తరపున గ్రామాల్లో ప్రచారానికి అక్కడి రైతులు రానివ్వని ఉదంతాలను చూసిన బిజెపి నేతలు కంగన మాటలతో తమ పని అయిపోయినట్లే భావించారు. నష్ట నివారణ చర్య తీసుకున్నప్పటికీ కంగన మాటలు రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక అస్త్రంగా మారటం అనివార్యం. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఒక తీర్మానం కూడా చేసింది. రెండవసారి శంభు సరిహద్దులో ఆందోళన ప్రారంభించి రెండు వందల రోజుల సందర్భంగా జరిగే నిరసనకు రెజ్లర్ వినేష్ ఫోగట్ రానున్నట్లు వార్తలు.

రైతులపై నోరు పారవేసుకున్న కంగన మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటుండగా తగ్గేదేలే అంటూ కుల గణన జరగదు అని మరొక ప్రకటన వదిలారు. వెంటనే అది మా వైఖరి కాదంటూ దానికి కూడా జనానికి బిజెపి సంజాయిషీ చెప్పుకోవాల్సి వచ్చింది. 'న్యూస్ 24' అనే టీవీతో మాట్లాడుతూ కుల గణన తప్పకుండా చేయాలా అన్న ప్రశ్నకు అవసరమే లేదు అంటూ కంగన చెప్పేశారు. కుల గణన మీద యోగి ఆదిత్యనాథ్ వైఖరే తనదని, అందరం కలసి ఉంటేనే మంచిదని, విడిపోతే నాశనం అవుతామన్నారు. "కులగణన జరపకూడదు. నటుల కులమేమిటో మనకు తెలియదు. ఎవరికీ ఏమీ తెలియదు. నా చుట్టూ ఉన్నవారు కులం గురించి పట్టించుకోరు. దాన్ని ఎందుకు ఇప్పుడు తేల్చాలి. గతంలో మనం చేయలేదు, ఇప్పుడూ అవసరం లేదు..." అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కావాలంటే రాష్ట్రాలు కుల గణన చేసుకోవచ్చు తప్ప కేంద్ర ప్రభుత్వం చేపట్టదని, ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని బిజెపి నేతలు పదే పదే చెప్పిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఎన్నికలకు ముందు మరోసారి ఎన్‌డిఏ కూటమిలో చేరిన జెడియు నితీష్ కుమార్ బీహార్‌లో కులగణన చేశారు. అనేక రాష్ట్రాలలో అలాంటి డిమాండ్ ముందుకు వచ్చింది. కేంద్రమే జనాభా లెక్కలతో పాటు జరపాలని ప్రతిపక్ష పార్టీలు కోరాయి. ఎన్నికలో బిజెపికి సంపూర్ణ మెజారిటీ రాలేదు, మిత్రపక్షాల మీద ఆధార పడాల్సి వచ్చింది. దాంతో వాటి ఒత్తిడికి లొంగిపోయింది. కంగన ప్రకటన మరోసారి బిజెపిని ఇరుకున పెట్టింది. "అవసరం తలెత్తితే తాము కులగణన చేస్తామని హోంమంత్రి చెప్పారని, కనుక కంగన చెప్పిన మాటలు పార్టీ వైఖరిని ప్రతిబింబించవు" అని బిజెపి జాతీయ ప్రతినిధి గురు ప్రకాష్ పాశ్వాన్ ప్రకటించాల్సి వచ్చింది. అయితే ఇంతవరకు కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

తోటకూర నాడే మందలించి ఉంటే అనే సామెత తెలిసిందే. గతంలో కంగనా రనౌత్ చేసిన అనేక వివాదాస్పద ప్రకటనలు, ప్రత్యర్థులపై ఎదురు దాడికి దిగినపుడు బిజెపి నోరు మెదపలేదు.



దాడి జరపటాన్ని ఆస్వాదించింది. పరిస్థితి మారిన తరువాత ఇప్పుడు ప్రతి మాట వల్లా పార్టీకి ఎదురు దెబ్బ తగులుతోంది. అయినా సరే. ఆమె ఎక్కడా తగ్గటం లేదు. తన సినిమా గురించి ప్రచారం చేసుకుంటూ చౌకబారు, తెలివి తక్కువ ప్రకటనలు, వివాదాస్పద వ్యాఖ్యలతో ఉచిత ప్రచారం పొందాలని చూస్తున్నట్లు కనిపిస్తున్నది. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన 2014 లోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని 2021లో చెప్పారు. స్వీయ అనుభవంతో తానీ మాటలు చెబుతున్నట్లు, తన అతి మంచితనం కారణంగా వ్యవస్థ తనను దేశం విడిచి అమెరికా వెళ్లేట్లు చేసిందని, మోడీ అధికారానికి వచ్చాక తాను తిరిగి వచ్చానని అందుకే అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు భావిస్తున్నట్లు చెప్పుకున్నారు. అదే విధంగా కత్రీనా కైఫ్ వంటి విదేశీ హీరోయిన్లు ఎంతో రాణించారని కానీ 2014 తరువాత స్వదేశీ నటీనటులు, కథలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, విదేశీయుల నృత్యాలు ఆపాలని జనం చెప్పారని, ఇటాలియన్ ప్రభుత్వాన్ని తొలగించి ఒక చాయ్‌వాలాను ప్రధానిని చేశారని కూడా సెలవిచ్చారు. సుభాష్ చంద్రబోస్‌ను భారత తొలి ప్రధాని అని చెప్పటమే కాదు, ఆయన అజాద్ హింద్ ప్రభుత్వాన్ని ఏర్పరచిన కారణంగా బోసే ప్రథమ ప్రధాని అని సమర్థించుకున్నారు. తనను విమర్శించిన వారికి రెండు రకాల మెదడు కణాలు ఉంటాయని వారికి ఇది అర్థం కాదని కూడా ఎదురు దాడి చేశారు. రామనాథ్ కోవింద్‌ను 'కోవిడ్'గా పలకటమేగాక, ప్రథమ దళిత రాష్ట్రపతిగా వర్ణించి తరువాత నాలుక కరుచుకున్నారు. అలాంటి కంగన సినిమా ఎమర్జన్సీ గురించి సెన్సార్ బోర్డు ఏం చేస్తుందో, బిజెపి ఏం చెబుతుందో వాటి మీద స్పందనలు ఎలా ఉంటాయో చూద్దాం!

◆

కవిత్వం

డిమాండ్

కనిపిస్తోంది నాకు
వంటిల్లు ఓ అనకొండలా...
నా కలల కాంతుల్ని
ఆకాంక్షల దివ్వెలని
దిగమింగుతున్న దెయ్యంలా
కిరాతకమైన కార్చిచ్చు
సుందర వనాలను
బూడిద చేసినట్టు
వంటిల్లు నా భవితకు
కడుతోంది నిలువెత్తు సమాధి
వంటింటి పని
అదేదో పేటెంటు హక్కన్నట్ట
నాకే ఎందుకు అంటగట్టాలి...?
జీతం భత్యం లేని వంటింటి
చాకిరికి నేను మాత్రమే
ఎందుకు బలి కావాలి...?
ఉద్యోగం చేయలేనా... ?
ఊళ్లేలలేనా...?
ఏం చేతకాదని నాకు
వంటింటి కుందేలుగా
మగ్గిపోయి మరణించడానికి...?
సమాజ గతిని మార్చే
సాహసాలు నేనూ... ! చేయగలను
నీకే కాదు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు
నాక్కూడా నా జన్మ హక్కే...!
ఇక కట్టిపెట్టు నీ పెత్తనాల పోకడలు
ఆపేసెయ్ నీ ఒంటెత్తు విధానాలు
ఆధునిక మహిళను నేను
చరిత్రను తిరగ రాస్తాను
నా ఎదుగుదలకు ప్రతిభా
సామర్థ్యాల వికాసానికి
వంటిల్లు ఓ గుదిబండ
అందుకే డిమాండ్ చేస్తున్నాను
వంటిల్లు ధ్వంసం కావాలని.

- వి. రాజగోపాల్, విజయనగరం,
సెల్ : 9490098036

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

- 3.67 లక్షల క్యూసెక్కుల సముద్రం పాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో అధికారులు ప్రకాశం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం బ్యారేజీకి 3,63,930 క్యూసెక్కుల నీరు వస్తుండగా 3,67,875 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ రిజర్ కన్జర్వేటర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తెలిపారు. బ్యారేజీకి ఉన్న 70 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సాగర్, పులిచింతల నుంచి వరద ప్రవాహం వస్తుండడంతోపాటు భారీగా వర్షపాతం నమోదు కావడం వల్ల ప్రకాశం బ్యారేజీకి మరింత వరద పెరిగే అవకాశం ఉంది. గుంటూరు, ఎన్‌టిఆర్, కృష్ణ, బాపట్ల జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలవనరులశాఖ అధికారులు హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామునకు వరద ప్రవాహం 4 లక్షల క్యూసెక్కులకు చేరవచ్చునని అంచనా వేశారు. వరద ఉధృతి నేపథ్యంలో భారీ ఎగువ, దిగువ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికార యంత్రాంగానికి సూచించారు. సాగర్ జలాశయానికి 3.61 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. వచ్చిన నీటిని వచ్చినట్టు డ్యామ్‌కు ఉన్న 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589 అడుగులుగా ఉంది. ఎగువ నుంచి పులిచింతలకు 3.08 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 3.11 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలుకాగా ప్రస్తుతం 38.36 టిఎంసిల నీరు నిల్వ ఉంది. పులిచింతల నుంచి వచ్చే నీటితో ప్రకాశం బ్యారేజికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.

25 ప్యాసింజర్ రైళ్లు రద్దు

- కొండపల్లిలో పట్టాలపై నీరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో విజయవాడ డివిజన్ పరిధిలో 25 ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. వీటిల్లో విజయవాడ నుండి తెనాలి, గూడూరు, కాకినాడ పోర్టు, రేపల్లె, మచిలీపట్నం, గుడివాడ, నిడదవోలు, భీమవరం, గుంటూరు, నరసాపూర్, ఒంగోలు వెళ్లే రైళ్లున్నాయి. ఇవి కాకుండా గుంటూరు రేపల్లె, తెనాలి రేపల్లె, గుడివాడ, మచిలీపట్నం మధ్య నడిచే రైళ్లను 31, 1, 2 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్‌టిఆర్ జిల్లా కొండపల్లిలో తొలిసారి రైలు పట్టాలపైకి వర్షపునీరు వచ్చి చేరింది. భారీగా నీరుపారడంతో పట్టాలు కొట్టుకుపోయాయి. దీంతో రైళ్లను ఎక్కడికక్కడ నిలిపేశారు. వీలైనంత త్వరగా రైళ్ల రాకపోకలు పునరుద్ధరిస్తామని డిఆర్ఎం తెలిపారు.

ఆగస్టులో సాధారణం కన్నా

16శాతం అధిక వర్షపాతం!

- అల్పపీడనాలు, రుతుపవన ద్రోణి వల్లే ఈ పరిస్థితి
- సెప్టెంబరులో కూడా ఎక్కువే వుండొచ్చు
- ఐఎండి వెల్లడి



న్యూఢిల్లీ : ఆగస్టు మాసంలో దేశంలో సాధారణం కన్నా దాదాపు 16 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. సెప్టెంబరు మాసంలో కూడా సాధారణం కంటే ఎక్కువగానే వర్షాలు పడే అవకాశం వుందని పేర్కొంది. వాయువ్య భారతంలో ఆగస్టులో 253.9 మి.మీ వర్షపాతం నమోదైంది. 2001 తర్వాత ఆగస్టు మాసంలోనే ఇది రెండవ అత్యధికమని ఐఎండి శనివారం పేర్కొంది. ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్రో ఆన్‌లైన్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, సాధారణ వర్షపాతం 248.1 మి.మీ తో పోలిస్తే ఆగస్టులో దేశంలో 287.1 మి.మీ వర్షపాతం నమోదైందని చెప్పారు. మొత్తంగా చూసినట్లైతే భారత్‌లో 749 మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్ 1నుండి వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుండి సాధారణ వర్షపాతం 701 మి.మీగా వుంది. హిమాలయ పర్వత సానువుల్లోని అనేక జిల్లాల్లో, ఈశాన్య ప్రాంతంలో సాధారణం కన్నా తక్కువగా వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రాంతాలు ఎక్కువగా దక్షిణదిశగా కదలడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఐఎండి చీఫ్ చెప్పారు. అలాగే రుతుపవన ద్రోణి కూడా దక్షిణ దిశగానే వుండడం ఈ పరిస్థితికి మరింత దోహదపడిందన్నారు. కేరళ, మహారాష్ట్రలోని విదర్భతో సహా ఈశాన్య ప్రాంతంలోని పలు రాష్ట్రాల్లో ఈసారి తక్కువగా వర్షాలు పడ్డాయని చెప్పారు. ఆగస్టులో మొత్తంగా ఆరు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. వాటిల్లో రెండు ఉధృత రూపం దాల్చి తుపాన్లుగా మారాయి. ఈ ఆగస్టు మాసంలో మొత్తంగా 17 రోజుల పాటు అల్పపీడన ప్రభావం వుంది. సాధారణంగా 16.3 రోజుల పాటు ఈ ప్రభావం వుంటుంది. ఆగస్టు 10 నుండి 22 వరకు రుతుపవన ద్రోణి తన సాధారణ స్థితిలోనే వుండడంతో ఉత్తర, మధ్య భారతానికి సమీప ప్రాంతాల్లో మంచి వర్షపాతం నమోదైంది. తూర్పు భారతం, దక్షిణ ద్వీపకల్పం చివరికంటా ముఖ్యంగా తమిళనాడు ప్రాంతాల్లో బాగా వర్షాలు పడ్డాయి. ఆగస్టు 23 నుండి 31 వరకు ఈ ద్రోణి తన సాధారణ స్థితి నుండి దక్షిణ దిశకు మళ్లింది.. దాంతో మధ్య, పశ్చిమ భారతావనిలో భారీ నుండి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. ఆగస్టు రెండో అర్ధభాగంలో ఎంజెఒ చాలా క్రియాశీలంగా వుంది. ఫలితంగా మంచి వర్షాలు పడ్డాయని ఆయన చెప్పారు. ఎంజెఒ (మాడెన్-జూలియన్ ఆస్లేషన్) అంటే ఉష్ణమండల ఆఫ్రికా ప్రాంతంలో ఉద్భవించి తూర్పు వైపునకు ప్రయాణిస్తున్న అతిపెద్ద వాతావరణ అల్లకల్లోలం. ఇది 30 నుండి 60 రోజుల పాటు వుంటుంది.



గుంటూరు జిల్లా కుంచనపల్లిలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వాయుగుండం తీరును పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత, సిఎస్ నీరబ్

కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మంత్రి, సిఎస్ పర్యవేక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరదలు, భారీ వర్షాల నేపథ్యంలో కుంచనపల్లిలోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూములో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, సిఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ పర్యవేక్షించారు. సిసిఎల్ఎ జయలక్ష్మి నేతృత్వంలో ఏర్పాటైన కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు కూడా అక్కడకు చేరుకున్నారు. అనంతరం సిఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించి శాటిలైట్ మ్యాపులను పర్యవేక్షిస్తూ ఆయా జిల్లాల పోలీసు అధికారులు, కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు కూడా అక్కడకు చేరుకున్నారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల రూము 24 గంటలూ పర్యవేక్షణలో ఉంటుందని ప్రకృతి విపత్తుల విభాగం మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

రాజధాని ప్రాంతం జలమయం

- పొంగిన కొండవీటి, కొటేళ్ల, పాలవాగులు
- హైకోర్టు పరిసరాలను చుట్టుముట్టిన నీరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి గ్రామాలు మరోసారి ముంపు ముప్పుబారిన పడ్డాయి. శుక్రవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలతో కొండవీటివాగు, కొటేళ్ల వాగు పొంగాయి. వీటి ప్రభావంతో లాం వద్ద గుంటూరు, అమరావతి మధ్యలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈనీరు రాజధాని గ్రామాల్లోకి చేరడంతో ఎక్కడికక్కడ చెరువులను తలపిస్తున్నాయి. శనివారం ఉదయం నాటికే హైకోర్టు పరిసరాలన్నీ నీటితో నిండిపోయాయి. గతంలో ప్రభుత్వం టవర్ల నిర్మాణం కోసం తవ్విన గుంతల్లోకి పెద్దఎత్తున నీరొచ్చి చేరింది. పెదపరిమి నుండి తుళ్లూరు వెళ్లేరోడ్డుపైకి నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ముళ్లకంప తొలగింపు పనులకూ నీటితో అంతరాయం ఏర్పడింది. వైకుంఠపురం నుండి వచ్చే పాలవాగుపరిధిలోకి నీరొచ్చి చేరడంతో ప్రవాహం నిలిచిపోయింది. వెంకటపాలెం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు క్రమంలో పాలవాగు ప్రవాహమార్గానికి అడ్డుకట్ట పడింది. దీన్ని సిఆర్‌డిఎ, ఇరిగేషన్ అధికారులు వచ్చి పరిశీలించారు. ఆదివారం అడ్డు తొలగింపు పనులు చేస్తామని ప్రకటించారు. కొండవీటివాగు నీరు కూడా పెద్దఎత్తున పొలాల్లోకి చేరింది. ఈ నీరంతా ఉండవల్లి వద్దకు చేరుకునే సరికి మరో రెండు రోజులు పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఒకవైపు కృష్ణానదికి వరద వచ్చిన నేపథ్యంలో లిఫ్టులు వేసినా నదినీరు లోపలకు వస్తుంది మినహా వాగునీరు బయటకు పోయే అవకాశం చాలా తక్కువని సిఆర్‌డిఏ అధికారులు అంచనా వేస్తున్నారు. కృష్ణానదిలో నీరు కొండవీటివాగులోకి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎక్కడికక్కడ ముళ్లచెట్లు పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అటంకంగా ఉంది. ఎక్కడ నీరుఅక్కడ నిచిలిపోతోంది. ఇప్పుడు నీటి తొలగింపు సిఆర్‌డిఏ అధికారులకు సవాల్‌గా మారనుంది.

గుజరాత్‌లో వరద బాధితుల ఆక్రందనలు

- పూర్తిగా చేతులెత్తేసిన డబుల్ ఇంజిన్ సర్కార్
- ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పినాయిల్ తాగిన యువకుడు

అహ్మదాబాద్ : ఢిల్లీ ఎన్నికలైనా..గల్లీ ఎన్నికలైనా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'డబుల్ ఇంజిన్ సర్కార్' అంటూ నినదిస్తుంటారు. కేంద్రంలోనూ, స్థానికంగానూ బిజెపియే ఉంటే డబుల్ ఇంజిన్‌లా అభివృద్ధి పరుగులు పెట్టిస్తామంటూ ప్రసంగాలు దట్టిస్తుంటారు. ఆయన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఇప్పుడు డబుల్ ఇంజిన్ సర్కారే పాలనలో ఉంది. కానీ భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. భారీ వర్షాల కారణంగా నదులు ఉప్పొంగడంతో పలు ప్రాంతాలలో వరదలు పోటెత్తాయి. తమ నివాసాలు నీటిలో మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమకు తాత్కాలిక వసతి,ఆహారం అందించాలని వేడుకుంటున్నా బిజెపి ప్రభుత్వం కనీసంగానైనా కనికరం చూపడం లేదు. దీనికి తోడు అధికారుల అలసత్వం తోడవ్వడంతో ప్రజలే బతుకు జీవుడా అంటూ రోజులు లెక్కిస్తున్నారు. జామ్‌నగర్‌లోని వరద బాధితులను ఆదుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ తీరుతో విసుగుచెందిన ఒక యువకుడు ఫినాయిల్ తాగి నిరసన వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని బాధితులు జామ్‌నగర్ జిల్లా అభివద్ధి అధికారి (డిడిఒ) భంబీని ఆశ్రయించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఉన్నతస్థాయి అధికారులు ముంపు ప్రాంతాలను సందర్శించడానికి వచ్చిన సమయంలో విపుల్ అనే యువకుడు తీవ్ర నిరసన తెలిపారు. కనీస అవసరాలు కూడా తీర్చకపోతే అధికారులు ఉండి ఏమి లాభమంటూ ప్రశ్నించారు. తన నిరసనను తెలుపుతూ వెంట తెచ్చుకున్న ఫినాయిల్ తాగాడు. అధికారులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వరదల కారణంగా చాలామంది ప్రజలు ఇళ్లలోనే చిక్కుకుపోయారని, వారిని రక్షించి, తాత్కాలిక వసతి కల్పించాలని ఆయన కోరాడు. ఈ సమస్యలపై జిల్లా పంచాయతీకి పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీనిపై జామ్‌నగర్ కలెక్టర్ భవిన్ పాండ్యా మాట్లాడుతూ గతకొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నాయని పేర్కొన్నారు. ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్ బందాలు ఇప్పటికే సహాయచర్యల్లో పాల్గొన్నాయని, వరదల్లో చిక్కుకున్న దాదాపు 20,000 మందిని రక్షించామన్నారు.

కాశ్మీర్‌లో ఏడుగురు పోలీసు అధికారుల బదిలీ

- ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రభుత్వం ఉత్తర్వులు

జమ్మూ : జమ్మూకాశ్మీర్‌లో ఏడుగురు పోలీసు అధికారులు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇందులో ఇద్దరు ఐపీఎస్‌లు కూడా ఉన్నారు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఆదేశాల మేరకు జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం బదిలీలు చేసింది. ఈ మేరకు జమ్మూకాశ్మీర్ హెూం ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒక ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఏడుగురు పోలీసు అధికారులకు కొత్త బాధ్యతలను అప్పగించారు. జమ్మూకాశ్మీర్ పోలీస్ సర్వీసెస్ (జెకెపిఎస్) నుంచి నలుగురు పోలీసు అధికారులను శ్రీనగర్, బారాముల్లా, కుప్వారా జిల్లాలకు ఎస్ఎస్పీలుగా, హంద్వారా ఎస్పీలుగా నియమిస్తూ జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. బారాముల్లా, కుప్వారా జిల్లాల ఎస్ఎస్పీలుగాగా ఉన్న గురిందర్‌పాల్ సింగ్, శోభిత్ సక్సేనాలను డైరెక్టర్ పోలీస్ టెలికమ్యూనికేషన్స్ ఇంచార్జిగా, సిఐడి (హెడ్‌క్వార్టర్స్) ఎస్ఎస్పీలుగా నియమితులయ్యారు. హంద్వారా ఎస్పీ దావుద్ అయూబ్‌ను సిఐడి ఎస్ఎస్‌పిగా నియమించారు. కాగా, జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగటానికి ఇలాంటి బదిలీలు చేపడుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

సైబర్ స్కామ్

లావోస్‌లో చిక్కుకున్న 47 మంది భారతీయులు

- ఎంబసీ జోక్యంతో బయటకు

వియెంటియేన్: లావోస్‌లో సైబర్ స్కామ్ సెంటర్ల ఉచ్చులో చిక్కుకున్న 47 మంది భారతీయులు ఎంబసీ జోక్యంతో బయటపడ్డారు. బూటకపు జాబ్ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని భారతీయ అధికారులు హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నుంచి ఇంతవరకు 635 మంది భారతీయులను కాపాడి సురక్షితంగా ఇంటికి తిరిగి పంపినట్లు ఇక్కడి భారతీయ దౌత్య కార్యాలయం తెలిపింది.

ఇజ్రాయిల్ దురాగతాలకు మద్దతు

- వలసవాసుల నియంత్రణ
- సిఎన్ఎన్ ఇంటర్వ్యూలో కమలా హారిస్

వాషింగ్టన్: గాజాలో మారణహోమాన్ని సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు ఎప్పటిలానే ఆయుధాలు సప్లై చేస్తామని, ఇతర దేశాల నుంచి వచ్చే వలసవాసులను అడ్డుకునేందుకు నిబంధనలు కఠినతరం చేస్తామని అమెరికన్ డెమొక్రాట్ అభ్యర్థి కమలా హారిస్ చెప్పారు. ఆమె శుక్రవారం సిఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం స్పష్టం చేశారు. లక్షలాది మంది అమెరికన్ విద్యార్థులు బైడెన్ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నెలల తరబడి నిరసనలు తెలిపినప్పటికీ హారిస్ వాటినేమీ పట్టించుకోకుండా అదే విధానాన్ని కొనసాగిస్తామని చెప్పడం గమనార్హం.

సురక్షితమైన తాగు నీరు కొందరికే!

- ప్రపంచంలో సగం మందికి కలుషిత నీరే గతి

జెనీవా: సురక్షిత తాగు నీటికి నోచుకోని అభాగ్యులు ప్రపంచంలో సగానికిపైగా ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉంది కదూ. కానీ, ఇది నిజం. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం దాదాపు 440 కోట్ల మందికి సురక్షిత తాగు నీరు అందుబాటులో లేదని తేలింది. ఈ విషయంలో ధనిక , పేద దేశాల మధ్య అంతరం ఎక్కువగా ఉంది. కలుషిత నీరు తాగడం వల్ల కలరా, విరేచనాలు, టైఫాయిడ్, నోరోవైరస్ వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడుతున్నారు. సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన ప్రకారం అల్పాదాయ, మధ్య ఆదాయ దేశాల్లో నివసిస్తున్న వారిలో మూడింట రెండొంతుల మందికి స్వచ్ఛమైన తాగు నీరు అందుబాటులో ఉండడం లేదని తేలింది. భారత్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, ఇరాన్, మాల్దీవులు, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక దేశాల్లో సగానికిపైగా జనానికి సురక్షితమైన మంచినీరు ఇప్పటికీ సుదూర స్వప్నంగానే మిగిలిపోయింది. సబ్ సహారన్ ఆఫ్రికన్ దేశాల్లో 80 శాతం మంది సురక్షితమైన తాగు నీరు అందుబాటులో లేదు.

కోర్టు ధిక్కార కేసులో దండేకు రూ.2 వేల జరిమానా

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కార కేసులో గిరిజన సంక్షేమశాఖ పూర్వపు ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే (ప్రస్తుతం రవాణా, ఆర్అండ్ బి ముఖ్య కార్యదర్శి)కి హైకోర్టు రూ.2 వేల జరిమానా విధించింది. ఇదే సమయంలో ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇఎన్సి) ఎస్.శ్రీనివాస్కి రెండు వేల రూపాయల జరిమానాతో పాటు రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ శుక్రవారం తీర్పు వెలువరించారు. వారిద్దరూ హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ఎదుట లొంగిపోవాలని ఆదేశించారు. సింగిల్జడ్జి వెలువరించిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ ఆ ఇద్దరు అధికారులు అత్యవసరంగా దాఖలు చేసిన అప్పీళ్లపై జస్టిస్ రావు రఘునందన్రావు, జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ధర్మాసనం విచారించింది. సింగిల్ జడ్జి తీర్పు అమలును రెండు వారాల పాటు నిలిపేసింది. తదుపరి విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది.ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా చేస్తున్న తన సర్వీసును పరిగణనలోకి తీసుకొని ప్రమోషన్ కల్పించాలని, సూపరింటెండింగ్ ఇంజనీర్గా ఉద్యోగోన్నతి కల్పించడం లేదంటూ గిరిజన సంక్షేమ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వసంత 2021లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎఇలు, ఎఇఇలు, డివైఇఇల సీనియారిటీ జాబితాను నాలుగు నెలల్లో ఖరారు చేయాలని అధికారులను ఆదేశిస్తూ 2022లో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయలేదంటూ వసంత దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటీషన్లో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం నిలుపు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.


రహస్య బ్యాలెట్ ద్వారానే లద్దగిరి పాఠశాల కమిటీ ఎన్నిక హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

తమ గ్రామ పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యానికి ఆస్కారం లేకుండా ఎన్నికలను రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని కోరుతూ లద్దగిరి గ్రామస్తుడు షేక్ మహబూబ్ బాషా హైకోర్టులో అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశా రు. జస్టిస్ రాజశేఖరరావు ఎదుట జరిగిన విచారణ సమయంలో పిటిషనర్ అడ్వకేట్ పి.శివప్రసాద్ వాదనలు వినిపిస్తూ, ఓటర్ల భద్రత కోసం ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహించాలన్న వినతిపత్రాలను అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. వాదనల తర్వాత హైకోర్టు స్పందిస్తూ.. పిటిషనర్ ఆందోళన ఆధారంగా స్పందించడం కష్టమేనని, ఆందోళనలతో దాఖలు చేసే వ్యాజ్యాలకు విచారణార్హత లేదని పేర్కొంది. అయినప్పటికీ, ఎన్నిక లు ప్రజాస్వామ్యయుతంగా ఉండాలన్న సంకల్పంతో పిటిషనర్ కోరిన విధంగా లద్దగిరి పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలను బ్యాలెట్ ద్వారానే నిర్వహించాలని అధికారులను ఆదేశించింది.

విశాఖ ఉక్కును సెయిల్లో విలీనం చేయాలి

- రాజ్యసభ సభ్యుల పిటిషన్స్ కమిటీకి సిపిఎం వినతి



రాజ్యసభ పిటిషన్స్ కమిటీకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

త్యాగాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్ప్లాంట్ను సెయిల్లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించా లని కోరుతూ రాజ్యసభ పిటిషన్ల కమిటీ చైర్మన్ సుజీత్ కుమార్కు సిపిఎం ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేసింది. స్టీల్ప్లాంట్ పరిస్థితిని, తీసుకోవాల్సిన చర్యలను వివరించింది. విశాఖ నోవాటెల్లో ఉన్న రాజ్యసభ సభ్యుల పిటిషన్స్ కమిటీ బృందాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.గంగారావులతో కూడిన బృందం కలిసింది. రాష్ట్ర ప్రగతిలో కీలకమైన ఈ ప్లాంట్ను వంద శాతం ప్రయివేటీకరించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించిన దగ్గర నుంచి విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటాలను సిపిఎం నాయకులు వివరించారు. ప్లాంట్కు ఎందుకు నష్టాలు వస్తున్నాయో తెలియజేశారు. హెచ్ఆర్ఎపై ఓటీ ఇప్పించాలని, విశాఖలోని ఎస్బిసి బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి ఇవ్వాలని నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రెడ్డి వెంకటరావు, విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో సమస్యలపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జోతీశ్వర రావులు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

ప్రభుత్వ రంగ సంస్థలపై వినతుల స్వీకరణ

రాజ్యసభ సభ్యులు సుజీత్ కుమార్ నేతృత్వాన రాజ్యసభ సభ్యుల పిటిషన్స్ కమిటీ విశాఖలో పర్యటించింది. ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి వినతులను స్వీకరించింది. దేశ వ్యాప్తంగా అడుగంటిపోతున్న నదుల సంరక్షణ, పునరుద్ధరణ పిటిషన్పై విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో సమీక్ష చేపట్టింది. హిందుస్థాన్ షిప్యార్డ్ లిమిటెడ్, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, ఎపి మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఎపి అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మినిస్ట్రీ ఆఫ్ పోర్ట్స్, షిప్పింగ్, మినిస్ట్రీ ఆఫ్ స్టీల్, మినిస్ట్రీ ఆఫ్ వాటర్ రిసోర్సెస్, రివర్ డెవలప్మెంట్ సంస్థలు ఈ సమీక్షలో పాల్గొన్నాయి. ఈ సమావేశానికి ఆతిథ్యమిచ్చిన విశాఖపట్నం పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు... విశాఖపోర్టు కార్యకలాపాలను, సాధించిన విజయాలను కమిటీకి వివరించారు. వరల్డ్ బ్యాంక్ సిపిపిఐ - 2023లో విశాఖపట్నం పోర్టుకు 19వ ర్యాంక్ కేటాయించిందని తెలిపారు. ఆ ర్యాంకును ఏ ప్రాతిపదికన ఇస్తారన్న విషయాన్ని కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. పోర్టులో మిలియన్ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రశంసించారు.

ఓలేటి శ్రీనివాసరావుకు మాతృ వియోగం

ప్రజాశక్తి - తాడేపల్లి



ప్రజాశక్తి జాబ్వర్క్ జనరల్ మేనేజర్ ఓలేటి శ్రీనివాసరావు తల్లి సామ్రాజ్యం (78) ఆదివారం రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలోని స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులందరినీ సిపిఎం, ప్రజాసంఘాల్లో భాగస్వాములను చేయడంలో ఆమె కృషి ఉంది. పెద్ద కుమారుడు శివశంకర్ ఎలక్ట్రీషియన్గా పనిచేస్తున్నారు. ఆయనతోపాటు ఆయన భార్య మల్లీశ్వరి సిపిఎం అభిమానులుగా ఉన్నారు. మనవడు బాజీబాబు ప్రజాశక్తి బుక్హౌస్ విభాగంలో పనిచేస్తున్నారు. రెండో కుమారుడు శ్రీనివాసరావు ప్రజాశక్తి జిఎంగా ఉన్నారు. కోడలు ఓలేటి శాంతిశ్రీ ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యులుగా ఉన్నారు. మూడో కుమారుడు రమేష్ ప్రజాశక్తి అడ్వర్టయిజ్మెంట్ విభాగంలో పనిచేస్తున్నారు. పెద్ద కుమార్తె వల్లభాపురం శివపార్వతి వ్యవసాయ కార్మిక సంఘం సభ్యురాలిగా, ఆమె భర్త వెంకటేశ్వరరావు సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్నారు. రెండో కుమార్తె ఊరట చెంచమ్మ, ఆమె భర్త శ్రీనివాసరావు, మూడో కుమార్తె నెమలిపురి వెంకట రమణ, ఆమె భర్త వెంకటేశ్వరావులు, మూడో కోడలు విజయలక్ష్మి సిపిఎం అభిమానులుగా ఉన్నారు.

సిఎంగా తొలిసారి 30 ఏళ్ల క్రితం బాబు బాధ్యతలు
నేడు టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి ఆదివారంతో 30 ఏళ్లు గడుస్తుండటంతో తెలుగుదేశం పార్టీ సంబరాలకు సిద్ధమౌతోంది. రాష్ట్రవ్యాప్తంగా సంబరాలను నిర్వహించనున్నట్లు టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ తెలిపారు. టిడిపి కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 1995 సెప్టెంబర్ 1వ తేదీన చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశారని చెప్పారు. దీనిని పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా టిడిపి కార్యాలయాల్లో చంద్రబాబు ఫోటోలు, ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలుగు ప్రజల ఖ్యాతిని ఉన్నతస్థానంలో ఉంచడమే చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. ఆయన ముందుచూపునకు ఎవరూ సాటి రాలేరని తెలిపారు. నవ్యాంధ్ర నిర్మాణం ఆయనతోనే సాధ్యమని అన్నారు, అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజలతో మమేకమైన వ్యక్తి అని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురొచ్చినా ఆత్మవిశ్వాసంతో నిలబడ్డారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని పేర్కొన్నారు. సాంకేతిక అభివృద్ధికి నాంది పలికారని వెల్లడించారు. 2019లో ప్రజలు మోసపోయి జగన్కు ఓట్లు వేశారని అన్నారు. నేడు చంద్రబాబుపై నమ్మకంతో ఓట్లు వేశారని, ప్రజల నమ్మకాన్ని ఆయన నిలబెడతారని చెప్పారు. ఎన్టి రామారావు రూ.30లతో పింఛన్ ప్రారంభించారని పేర్కొన్నారు. ఇప్పుడు అందిస్తున్న రూ.4వేలలో చంద్రబాబే రూ.3,200 పెంచారని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వైద్యశిబిరాలు పెట్టి 19లక్షల మందికి వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు.

విద్యార్థినుల మనోభావాలు పరిగణనలోకి తీసుకోవాలి

- గుడ్లవల్లేరు ఘటనపై సమీక్షలో సిఎం ఆదేశం
- ఆధారాలు ఉంటే నేరుగా తనకు ఇవ్వాలని సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఘటనలో విద్యార్థినుల మనోభావాలను గౌరవించాలని, వారి ఆవేదనను అర్థం చేసుకుని విచారణ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించా రు. ఈ ఘటనపై శనివారం ఉన్నతాధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ చదువుకునే ఆడబిడ్డలకు ఇలాంటి వివాదం తలెత్తితే తీవ్ర మనోవేదనకు గురవుతారని తెలిపారు. వారికి, వారి తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎవరిదగ్గరైనా అదనపు సమచారం, ఆధారాలు ఉంటే నేరుగా తనకు పంపాలని సిఎం కోరారు. కొంతమంది ఈ ఘటనపై వారిని భయపెట్టేలా మరింత తప్పుడు ప్రచారం చేస్తుంటారని వివరించారు. అలాంటి వారిని అడ్డుకోవాలని తెలిపారు. సున్నితమైన అంశాల విషయంలో తప్పుడు ప్రచారం మరింత నష్టం చేస్తుందని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు విచారణ వివరాలు తనకు పంపాలని ఆదేశించారు. ఘటనలో తప్పు జరిగిందని తేలితే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్యార్థినులు ప్రశాంతంగా చదువు కొనసాగించే పరిస్థితిని కల్పించాలని సూచించారు. విద్యార్థులు చెప్పే అంశాలపై లోతుగా అధ్యయనం చేయాలని అన్నారు. ఇప్పటివరకూ జరిగిన పరిశీలనలో హిడెన్ కెమెరాలు దొరకలేదని అధికారులు తెలపగా, మరింత లోతుగా అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. అనుమానితులు, ఫోన్లు, ల్యాప్ట్యాపులను సైబర్ నిపుణుల ద్వారా టెక్నికల్గా పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆడబిడ్డల భద్రత వారి వ్యక్తిగత గోప్యత విషయాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా సైబర్ నిపుణులను ఉపయోగించుకుని డీ బగ్గింగ్ డివైజ్లను ఉపయోగించి తనిఖీలు చేపట్టాలని సూచించారు.

టిడిపి 'గ్రీవెన్స్' మంత్రుల జాబితా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో జరుగుతున్న గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన మంత్రులు, పార్టీల నేతల జాబితాను టిడిపి ఈ నెల 14వ తేది వరకు విడుదల చేసింది. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించేందుకు ఈ నెల 14వ తేదీ టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వెల్లడించింది.

తేదీ	మంత్రి	పార్టీ నేత
సెప్టెంబర్ 2	గొట్టిపాటి రవికుమార్	ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు
సెప్టెంబర్ 3	వంగలపూడి అనిత	భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి
సెప్టెంబర్ 4	నిమ్మల రామానాయుడు	ఎమ్మెల్సీ బిటి నాయుడు
సెప్టెంబర్ 5	డోలా బాలవీరాంజనేయ స్వామి	కెఎస్ జవహర్(జాతీయ ప్రధాన కార్యదర్శి)
సెప్టెంబర్ 6	పయ్యావుల కేశవ్	పల్లా శ్రీనివాస్(రాష్ట్ర అధ్యక్షులు)
సెప్టెంబర్ 9	బిసి జనార్ధన్ రెడ్డి	రెడ్డి సుబ్రహ్మణ్యం(పొలిట్ బ్యూరో)
సెప్టెంబర్ 10	పి నారాయణ	వర్ల రామయ్య(పొలిట్ బ్యూరో)
సెప్టెంబర్ 11	ఆనం రామనారాయణ రెడ్డి	పనబాక లక్ష్మి(జాతీయ ఉపాధ్యక్షురాలు)
సెప్టెంబర్ 12	కొలుసు పార్ధసారధి	కొట్లసూర్యప్రకాష్ రెడ్డి (జాతీయ ఉపాధ్యక్షులు)
సెప్టెంబర్ 13	కొల్లు రవీంద్ర	పల్లా శ్రీనివాస యాదవ్

కలుషిత ఆహార ఘటనపై సమగ్ర దర్యాప్తు

- బాధ్యులపై చర్యకు ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎ అశోక్, కె ప్రసన్నకుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫుడ్ పాయిజన్ ఎలా జరిగిందో సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో తాగునీటి ప్లాంట్ లేదని తెలిపారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక బృందం నియమించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం ఎఎన్ఎంలను తొలగించిందని, ప్రస్తుత ప్రభుత్వం వీరిని నియమించి విద్యార్థుల మరణాలు అరికడతామని చెబుతున్నా, ఆచరణ రూపం దాల్చలేదని విమర్శించారు. తక్షణమే హెల్త్ వాలంటీర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



ఉడిపి వెళ్లిన జూనియర్ ఎన్టీఆర్


జూనియర్ ఎన్టీఆర్ మళ్లీ చాలా రోజుల తర్వాత తన కుటుంబం గురించి పోస్టు పెట్టారు. ఎక్కువగా తన సతీమణి గురించి పోస్టులు పెడుతుంటారు. తాజాగా ఆమె తల్లి షాలిని గురించి పోస్టుచేశారు. ఇదే పోస్టులో డైరెక్టర్ ప్రశాంత్నీల్, 'కాంతార' హీరో రిషబ్శెట్టి గురించి ప్రస్తావించారు. కర్నాటకలోని కుందపుర షాలిని సొంత ఊరు. గతంలో పలు సందర్భాల్లో తారక్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. కుమారుడిని సొంతూరికి తీసుకెళ్లాలని ఆమె ఎన్నాళ్ల నుంచే అనుకుంటోందట. తాజాగా ఈ విషయాన్ని ఎన్టీఆర్ తన ఇన్స్టాలో పోస్టుచేశారు. 'తన సొంతూరు కుందపురకి నన్ను తీసుకొచ్చి ఉడుపిలోని శ్రీకృష్ణమఠం తీసుకెళ్లాలనేది మా అమ్మకు చిరకాల కోరిక. అది ఇన్నాళ్లకు నెరవేరింది. దీన్ని సాధ్యమయ్యేలా చేసిన తన స్నేహితులు ప్రశాంత్నీల్, విజయ్కిరగందూర్కి ధన్యవాదాలు. అలాగే రిషబ్శెట్టికి స్పెషల్ థ్యాంక్స్. అతడు మాతోపాటు వచ్చి గడపడం ఎంతో సంతోషంగా ఉంది' అని అన్నారు.

నేడు బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానం సభ

- తనయుడు మోక్షజ్ఞ మూవీ ప్రకటన!



టాలీవుడ్ హీరో నందమూరి బాలకృష్ణ హీరోగా తన ప్రస్థానాన్ని 50 సంవత్సరాలు పూర్తిచేశారు. టాలీవుడ్ వేదికగా తెలుగుచిత్ర పరిశ్రమ ఈ వేడుకను హైదరాబాద్లో నిర్వహిస్తోంది. ఈ వేదికపైనే బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తెరంగ్రేటానికి రంగం సిద్ధమైంది. గత నాలుగైదేళ్లుగా ఈ ఎంట్రీపై పలుసార్లు ఊహాగానాలు రావటం, ఆగిపోవడం జరిగింది. సరైన కథ దొరక్కపోవటంతోనే ఇప్పటివరకూ ఆగినట్లుగా తెలిసింది. తాజాగా ఓ మంచి కథ దొరకడంతోపాటు అగ్ర దర్శకుడు కూడా సినిమా తీయడానికి ముందుకు రావటంతో మోక్షజ్ఞ ఎంట్రీకి రంగం సిద్ధమైనట్లుగా సమాచారం. వినాయకచవితికి ముందురోజైన ఈనెల ఆరోతేదీన రామకృష్ణ స్టూడియోస్లో ఈ సినిమా ముహూర్తం ఖరారుచేసినట్లుగా సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. ప్రశాంత్వర్మ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనున్నట్లుగా తెలిసింది. హైదరాబాద్లో 'బాలకృష్ణ సినీప్రస్థానం 50 ఏళ్లు' సభకు టీఎఫ్పీసీ, టీఎఫ్సీసీ, మా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. టాలీవుడ్కు చెందిన అగ్రనటులంతా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.




'బిర్సాముండా' జీవితంపై పా.రంజిత్ సినిమా

విక్రమ్-పా.రంజిత్ కాంబినేషన్లో తెరకెక్కిన 'తంగలాన్' విజయపథంలో కొనసాగుతోంది. తాజాగా ఈ సినిమా హిందీ వర్షన్తో బాలీవుడ్లో విడుదలైంది. ఈ సందర్భంగా డైరెక్టర్ పా.రంజిత్ తన కొత్త సినిమా గురించి వెల్లడించారు. ఈ సారి హిందీలో స్ట్రెయిట్ సినిమా కోసం స్క్రిప్ట్ సిద్ధం చేశానన్నారు. దానికి 'బిర్సాముండా' అనే టైటిల్ను కూడా నిర్ణయించినట్లుగా రంజిత్ అధికారికంగా ప్రకటించారు. పా.రంజిత్ సామాజిక అంశాలనే కథావస్తువులుగా తీసుకొని సినిమాలు తీస్తుంటారు. ఇప్పుడు ఆయన తెరకెక్కించనున్న బిర్సాముండా చిత్రం కూడా అదే కోవకు చెందినదే. అయితే నటీనటులు ఎవరనేది ఇంకా వెల్లడించలేదు. .

షూటింగ్లో రుబీనాకు కాంస్యం

పారిస్ పారా ఒలింపిక్స్



పారిస్: పారా ఒలింపిక్స్లో భారత షూటర్లు మరో పతకాన్ని సాధించారు. శనివారం జరిగిన మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ ఎస్హెచ్-1లో రుబీనా ఫ్రాన్సిస్ కాంస్య పతకం సాధించింది. షూటింగ్ విభాగంలో భారత్కు ఇప్పటికే స్వర్ణ, రజత, కాంస్య రాగా.. హోరాహోరీ ఫైనల్లో రూబీనా 211.1 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది. క్వాలిఫికేషన్ రౌండ్లో రుబీనా 556 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్కు చేరింది. ఫైనల్లోనూ ఆత్మవిశ్వాసంతో గురి పెట్టిన రుబీనా కాంస్యంతో మెరిసింది. ఇరాన్కు చెందిన సరేహ్ జవన్మర్ది (236.8 పాయింట్లు) స్వర్ణ పతకం చేజిక్కించుకోగా.. టర్కీకి చెందిన అజ్గాన్ (231.1పాయింట్లు) రజతం కైవసం చేసుకుంది.

బ్యాడ్మింటన్లో నిరాశ...

మహిళల బ్యాడ్మింటన్ గ్రూప్-సిలో మనీషా రాందాస్ ఓటమిపాలైంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ గ్రూప్-సి ఎస్యు-5లో మనీషా 15-21, 7-21తో యంగ్(చైనా) చేతిలో ఓడింది.



క్వార్టర్స్లో ఓడిన శీతల్..

మహిళల ఆర్చరీ క్వార్టర్ఫైనల్లో శీతల్ దేవికి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నా.. ఒక్క పాయింట్ వ్యత్యాసంతో ఓడి అందరి హృదయాలను గెలుచుకుంది. శనివారం జరిగిన క్వార్టర్ఫైనల్లో శీతల్ 137-138 పాయింట్ల తేడాతో ఛిలీకి చెందిన మరీనా చేతిలో ఓడింది. తొలి నాలుగు సెట్లు ముగిసేసరికి మరీనాతో పాయింట్లు సమంగా నిలిచిన శీతల్.. చివరి సెట్లో వరుసగా రెండు బాణాలను 8పాయింట్లకు పరిమితం చేయడంతో ఓటమికి కారణమైంది. అంతకు ముందు ప్రి క్వార్టర్స్లో శీతల్ దేవి 141-135పాయింట్లతో ఇటలీకి చెందిన ఎలోనేరాపై నెగ్గి క్వార్టర్ఫైనల్లోకి ప్రవేశించింది.

దులీప్ టోర్నీకి పదివేల పాస్ల పంపిణీ

- 5న 'అనంత' వేదికగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



జాతీయ స్థాయి క్రికెటర్లతో కూడిన దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు అనంతపురం ఆర్డిటి స్పోర్ట్స్ అకాడమీలో సెప్టెంబర్ 5 నుంచి 22వ వరకు జరగనున్నాయి. మ్యాచ్లు వీక్షించేందుకు పాస్లు కోసం క్రికెట్ అభిమానులు వేలాదిగా స్టేడియానికి చేరుకున్నారు. శనివారం ఉదయం నుంచే యువత పెద్ద ఎత్తున ఆర్డిటి వద్దకు వచ్చారు. దాదాపు 10 వేల పాస్లు నిర్వాహకులు పంపిణీ చేశారు. అనంతపురం జిల్లాలో దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప అవకాశం అని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) త్రీమెన్ కమిటీ సభ్యులు మాంఛో ఫెర్రర్ అన్నారు. మ్యాచ్లు స్టార్ స్పోర్ట్స్, జియోలో ప్రత్యక్ష ప్రసారం అవుతాయన్నారు.

క్యారవాన్లలో సీక్రెట్ కెమెరాలతో వీడియోలు

రాధిక శరత్కుమార్



మలయాళ చిత్ర పరిశ్రమలోనే కాకుండా చాలా ఇండస్ట్రీల్లో కూడా ఇలాంటి ఇబ్బందులను మహిళలు ఎదుర్కొంటున్నారు. నటీమణులకు కేటాయించిన కారవాన్లలో కొందరు సీక్రెట్ కెమెరాలు పెట్టి ఆపై వారి ప్రయివేటు వీడియోలు చిత్రీకరించిన సందర్భాలు కూడా ఇండస్ట్రీలో ఉన్నాయి. ఒక సినిమా షూటింగ్లో భాగంగా నేను కేరళ వెళ్లాను. అప్పుడు సెట్లో జరిగిన ఒక సంఘటన నేను ఇప్పటికీ మర్చిపోలేను. షూట్ ముగించుకుని నేను అటుగా వెళ్తున్న సమయంలో కొంతమంది మగవాళ్లు ఒక చోట గుమికూడి ఫోన్లో ఏదో చూస్తూ నవ్వుకుంటున్నారు. కానీ వారందరూ ఒక వీడియో చూస్తున్నారని నాకు అర్థమైంది. వెంటనే సినిమా యూనిట్లో పనిచేస్తున్న సిబ్బందిలో కొందరిని పిలిచి వారు ఏమి చేస్తున్నారో చూడమని పంపాను. అయితే అప్పుడు నాకు షాకింగ్ విషయం తెలిసిందే. కారవాన్లలో సీక్రెట్ కెమెరాలు పెట్టి ఆపై మహిళల వ్యక్తిగత వీడియోలను చిత్రీకరించి ఫోన్లో చూస్తున్నారని తెలిసింది. అప్పుడు వెంటనే అక్కడ చిత్ర యూనిట్ ఫిర్యాదుచేశాను. ఆ సంఘటన జరిగి చాలా ఏళ్లు అయ్యింది. అయినా, ఇప్పటికీ ఆ సంఘటన గుర్తు చేసుకుంటే నాకు భయం. ఆ రోజు నుంచి నేను కారవాన్ ఉపయోగించాలంటే భయపడతాను' అని నటి రాధిక శరత్కుమార్ పేర్కొన్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలపై వేధింపుల గురించి జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఎందరో నటీనటులు తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ క్రమంలో తాజాగా సీనియర్ స్టార్ హీరోయిన్ రాధిక శరత్కుమార్ పై విధంగా స్పందించారు.



తమన్ బాగా చిలిపి పనులు చేసేవాడు

తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 3 ప్రతి వారం ఎపిసోడ్ అభిమానుల్లో థ్రిల్ను పెంచుతోంది. సంగీత దర్శకుడు తమన్ తల్లి ఘంటసాల సావిత్రి ఈ వారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రోమో ఇప్పుడు వైరల్గా మారింది. తమన్ గురించి చాలా ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఘంటసాల సాయి శ్రీనివాస్ అలియాస్ తమన్ చిన్నప్పటి విషయాలను తెలిపారు. 'చిన్నప్పుడు క్లాస్రూమ్లో కన్నా మైదానంలోనే ఎక్కువగా ఉండేవాడు. అస్సలు భయం లేకుండా ఉండేవాడు. స్కూల్లో గొడవలు వచ్చేవి. తోటి పిల్లల టిఫెన్ బాక్సులు ఓపెన్ చేసి తినేసేవాడనే కంప్లయింట్లు ఉండేవి. అయితే తను హార్డ్వర్క్ చేసేవాడు. వర్క్ అయ్యే వరకూ తిండి గురించి కూడా పట్టించుకునేవాడు కాదు. సంగీతం, క్రికెట్ అంటే ఆయనకు ఎంతో ఇష్టం' అని వివరించారు.



ప్రపంచ పవర్ లిఫ్టింగ్లో మరో పతకం

- 93 కిలోల విభాగంలో ఖాజావలికి కాంస్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచ జూనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ - 2024 పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుల హవా కొనసాగుతోంది. మాల్టాలో జరుగుతున్న ఈ పోటీల్లో భారత్కు మరో పతకం దక్కింది. రాష్ట్రానికి చెందిన సయ్యద్ ఖాజావలి 93 కిలోల విభాగంలో డెడ్లిఫ్ట్లో 297.5 కిలోల బరువు ఎత్తి కాంస్య పతకం సాధించినట్లు ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ సూర్యానారాయణ, కోశాధికారి సిహెచ్ శేషుబాబు, గౌరవాధ్యక్షులు ఎం ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ పోటీల్లో షేక్ సాదియా అల్మాస్, దోనె మురళీకృష్ణ బంగారు పతకాలు సాధించిన సంగతి తెలిసిందే.

ఎసిఎ టి20 జట్టుకు మొహ్మద్జునైద్

ప్రజాశక్తి-రామసముద్రం (అన్నమయ్య జిల్లా)



ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ టి20 క్రికెట్ జట్టుకు అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రానికి చెందిన ఎస్.మొహ్మద్ జునైద్ ఎంపికయ్యారు. సెప్టెంబర్ 19 నుంచి 22 వరకు నేపాల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి టి20 పోటీల్లో ఆయన పాల్గొననున్నారు. మూడు రోజుల క్రితం హైదరాబాదులో జరిగిన టి20 క్రికెట్ మ్యాచ్లో అత్యంత ప్రతిభ చూపిన మొహ్మద్ జునైద్ను ఆంధ్ర టి20 జట్టుకు సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది. మొహ్మద్ జునైద్ టి20 జట్టుకు ఎంపికవడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఇండియన్ పారా క్రికెట్ లీగ్కు శివకోటి

ప్రజాశక్తి - నందలూరు (అన్నమయ్య జిల్లా)



తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ సర్వనంపట్టిలో సెప్టెంబర్ ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహించనున్న భారత పారా క్రికెట్ లీగ్కు అన్నమయ్య జిల్లా నందలూరుకు చెందిన ఏలుసూరి శివకోటి ఎంపికైనట్లు బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ శనివారం వెల్లడించింది. రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ కోయంబత్తూర్ గేలక్సీ వారి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పారా క్రికెట్ లీగ్ నిర్వహించనున్నారు. ఈ పోటీలకు భారత జట్టుకు వైస్ కెప్టెన్గా శివకోటి ఎంపికయ్యారు.

జమ్మూకాశ్మీర్‌లో ఎవరి వ్యూహమేంటి?

- కాషాయ పార్టీ ఆశలన్నీ జమ్మూ పైనే
- సమరోత్సాహంతో 'ఇండియా' బ్లాక్

శ్రీనగర్ : వచ్చే నెల 18వ తేదీ నుండి మూడు దశలుగా జరిగే జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికలకు జాతీయ, ప్రాంతీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ఎన్నికల్లో భాగస్వాములమవుతామని స్థానిక పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి), పీపుల్స్ కాన్ఫరెన్స్ (పిసి), జమ్మూకాశ్మీర్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెకెపిఎం), అప్నీ పార్టీ ఇప్పటికే ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు పెట్టుకోగా, బిజెపి ఒంటరి పోరుకు సిద్ధమైంది. 90 స్థానాలున్న జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో 87 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. 2014 తర్వాత అక్కడ ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. 2014లో బిజెపి, పిడిపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ అది కలహాల కాపురంగానే సాగింది. చివరికి 2018లో కూటమి విచ్ఛిన్నమైంది. ఫలితంగా శాసనసభ రద్దయింది. ప్రస్తుతం జమ్మూ కాశ్మీర్ ప్రాంతాలు లెఫ్టినెంట్ గవర్నర్ ఏలుబడిలో ఉన్నాయి.

కాశ్మీర్‌లో ప్రభావం చూపని బిజెపి

ముస్లిం మైనారిటీల ప్రభావం ఎక్కువగా ఉండే జమ్మూకాశ్మీర్ శాసనసభలోని అన్ని స్థానాలకూ పోటీ చేయాలా వద్దా అనే విషయంపై బిజెపి ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. ఆ పార్టీ ఇప్పటి వరకూ 45 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత లోయలో జరిగిన వార్డులు, పంచాయతీలు సహా అన్ని ఎన్నికల్లోనూ బిజెపి పోటీ చేస్తూనే ఉంది. ఆ పార్టీ ఏ ప్రాంతీయ పార్టీతోనూ అధికారికంగా పొత్తు పెట్టుకోనప్పటికీ పలువురు స్వతంత్రులకు, జమ్మూకాశ్మీర్ విషయంలో తన విధానాన్ని (ప్రత్యేక హోదా రద్దు) సమర్థించే చిన్న పార్టీలకు మద్దతు ఇచ్చింది. 2020లో జరిగిన జిల్లా అభివృద్ధి మండలి (డిడిసి) ఎన్నికల్లో బిజెపి అతి పెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 280 స్థానాల్లో ఆ పార్టీ 75 స్థానాలు లభించాయి. యాభై మంది స్వతంత్రుల మద్దతుతో బిజెపి ఆరు డిడిసిలను కైవసం చేసుకుంది. అయితే అన్నీ జమ్మూ ప్రాంతంలోనివే. కాశ్మీర్‌లో కమల దళానికి ఒక్క డిడిసి కూడా రాలేదు.

ఆదిలోనే హంసపాదు

లోక్‌సభ ఎన్నికల్లో బారాముల్లా, శ్రీనగర్, అనంతనాగ్-రాజౌరి స్థానాల్లో ఎన్‌సి, పిడిపి పరస్పరం తలపడ్డాయి. ఈ మూడింటిలో బిజెపి అభ్యర్థులను నిలపలేదు. లడఖ్, ఉధంపూర్, జమ్మూలో మాత్రం కాంగ్రెస్‌తో తలపడింది. జమ్మూలోని రెండు స్థానాలనూ బిజెపి గెలుచుకోగా లడక్‌లో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పలువురు ముస్లిం అభ్యర్థులను రంగంలోకి దింపింది. ముఖ్యంగా పిర్ పంజల్ లోయ నుండి ఆ పార్టీ తరపున ముస్లిం అభ్యర్థులు



బిజెపి ప్రకటించిన అభ్యర్థులు మాకు వద్దు అని ఆందోళన చేస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు

మెజారిటీ స్థానాల్లో బరిలో నిలిచారు. అయితే తొలి జాబితా ప్రకటనతో బిజెపిలో అసమ్మతి భగ్గుమంది. ఇతర పార్టీల నుండి వలస వచ్చిన వారికి పార్టీ టిక్కెట్లు ఇచ్చారని, పార్టీకి అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను విస్మరించారని పలువురు సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తొలి జాబితాను బిజెపి వెనక్కి తీసుకుంది. కానీ వైష్ణోదేవి స్థానంలో మాత్రమే అభ్యర్థిని మార్చింది. పార్టీకి గట్టి పట్టున్న నౌషెరా స్థానానికి ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

ఇండియా బ్లాక్‌కి బీజం

ఇండియా బ్లాక్ విషయానికి వస్తే...2020లో జమ్మూకాశ్మీర్‌కు చెందిన పలువురు నేతలు జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు తాజ్ మొహియుద్దీన్ ఎన్‌సీ సీనియర్ నేత ఫరూఖ్ అబ్దుల్లా నివాసంలో జరిగిన ఓ సమావేశానికి హాజరయ్యారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కోసం జరుపుతున్న పోరాటాన్ని ముందుకు తీసికెళ్లేందుకు ఆరు రాజకీయ పార్టీలు...ఎన్‌సి, పిడిపి, పిసి, కాంగ్రెస్, సిపిఎం, అవామీ నేషనల్ కాన్ఫరెన్స్ (ఏఎన్‌ఎస్) జట్టు కట్టేందుకు అక్కడే నాంది పడింది. పీపుల్స్ అలయన్స్‌లో తాను భాగస్వామిని కానప్పటికీ దానితో ఎన్నికల పొత్తు కుదుర్చుకునేందుకు సిద్ధమేనని కాంగ్రెస్ తెలిపింది. డిడిసి ఎన్నికల్లో ఈ ఫోరం మంచి ఫలితాలు సాధించింది. 280 స్థానాల్లో 110 సీట్లను గెలుచుకుంది.

ఎన్‌సి-పిడిపి మధ్య విభేదాలు

గత సంవత్సరం జులైలో ఎన్‌సీ, పిడిపి, సిపిఎంలను కాంగ్రెస్ ప్రతిపక్ష కూటమిలో చేర్చింది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో ఐక్య ప్రతిపక్ష ఫోరంగా ఏర్పాటు కోసం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరం శాసనసభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇచ్చిందని ఎన్‌సీ, పిడిపి ఆరోపించాయి. శాసనసభ ఎన్నికల కోసం ఈ రెండు పార్టీల మధ్య జరిగిన చర్చలు ఆదిలోనే బెడిసికొట్టాయి. కాశ్మీర్‌లోని మూడు స్థానాలూ తనకే కేటాయించాలని ఎన్‌సీ పట్టుపట్టింది. కానీ తన కంచుకోట అయిన అనంతనాగ్-రాజౌరి నుండి పోటీ చేయాలని పిడిపి చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆశించారు. అయితే ఆ సీటును పిడిపికి వదిలేసేందుకు ఎన్‌సీ ససేమిరా అంది. దీంతో ఇండియా కూటమి నుండి పిడిపి నిష్క్రమించింది. ఎన్‌సీ డిమాండ్‌కు కాంగ్రెస్ అంగీకరించింది. ఎన్‌సీ, కాంగ్రెస్ మధ్య కుదిరిన రాజీ లోక్‌సభ ఎన్నికల్లో సత్ఫలితాన్ని ఇచ్చింది. ఎన్‌సీ పార్టీ లోయలో రెండు స్థానాలు గెలుచుకుంది. కానీ మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా (ఎన్‌సీ-బారాముల్లా), మెహబూబా ముఫ్తీ (అనంతనాగ్-రాజౌరి...పిడిపి) ఇద్దరూ పరాజయం పాలయ్యారు.

చేయి కలిపిన ఎన్‌సి, కాంగ్రెస్

లోక్‌సభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. బిజెపి, ఎన్‌సి చెరో రెండు స్థానాలు, స్వతంత్రులు రెండు స్థానాలు గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో శాసనసభ ఎన్నికల కోసం సీట్ల సర్దుబాటు కుదుర్చుకోవాలని ఎన్‌సీ, కాంగ్రెస్ నిర్ణయించాయి. ఎన్‌సి 51, కాంగ్రెస్ 32 స్థానాలకు పోటీ చేస్తాయి. సిపిఎం, జమ్మూ కాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ చెరో స్థానంలో అభ్యర్థులను నిలుపుతాయి. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇచ్చేంత వరకూ ఎన్నికల్లో పోటీ చేయబోనని గతంలో ప్రకటించిన ఎన్‌సి నేత ఒమర్ అబ్దుల్లా మనసు మార్చుకొని గండర్‌బాల్ నుండి శాసనసభకు పోటీ చేస్తున్నారు.

దూరమైనా చేరువే...

తాము ఇండియా బ్లాక్‌కి దూరమైనప్పటికీ తమ ఎజెండాను అది అంగీకరిస్తే వారితోనే ఉంటామని పిడిపి అధినేత మెహబూబా ముఫ్తీ తెలిపారు. ఎన్‌సి తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలనే పిడిపి కూడా ఇచ్చింది. పిడిపి ఇప్పటికే 21 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. వీరిలో తొమ్మిది మంది ఎన్‌సీ అభ్యర్థులతో పోటీ పడుతున్నారు. మెహబూబా ముఫ్తీ అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉంటున్నప్పటికీ ఆమె కుమార్తె తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బిజెపితో పొత్తు పెట్టుకునే ప్రశ్నే లేదని పిడిపి స్పష్టం చేసింది.

అవి బిజెపికి తోక పార్టీలు

ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు సజ్జాద్ లోన్ నేతృత్వంలోని పీపుల్స్ కాన్ఫరెన్స్ (పిసి), కాంగ్రెస్ మాజీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ నాయకత్వంలోని డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డిపిఎపి), అల్తాఫ్ బుఖారీకి చెందిన అప్నీ పార్టీ కూడా ఎన్నికల క్షేత్రంలో నిలిచాయి. ఎన్‌సి, పిడిపి మధ్య తలెత్తిన విభేదాల నేతృత్వంలో 2021లో ప్రతిపక్ష కూటమి నుండి లోన్ వైదొలిగారు. బారాముల్లా స్థానంలో అబ్దుల్లాను సవాలు చేసి 1.73 లక్షల ఓట్లు సాధించారు. ఇక ఆజాద్ 2022లో కాంగ్రెస్‌ను వీడి వేరు కుంపటి పెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన పార్టీ మూడు స్థానాలకు పోటీ చేసి కేవలం 80,264 ఓట్లు మాత్రమే సాధించింది. అయినా రాబోయే శాసనసభ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడింది. అల్తాఫ్ బుఖారీ 30 మంది నేతలతో కలిసి పిడిపిని వదిలేసి అప్నీ పార్టీని ఏర్పాటు చేశారు. డిడిసి ఎన్నికల్లో ఆ పార్టీ 12 స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు 24 శాసనసభ స్థానాలకు పోటీ చేస్తోంది. బుఖారీ కూడా బరిలో నిలిచారు. కాగా ఈ మూడూ బిజెపికి తోక పార్టీలని ఇండియా బ్లాక్ విమర్శించింది. బిజెపి నేతలు మోడీ లేదా అమిత్ షా ఈ మూడు పార్టీల నేతలను ఎన్నడూ పల్లెత్తు మాట అనకపోవడం గమనార్హం. ఎన్‌సీ, కాంగ్రెస్, పిడిపిలకు ఓటు వేయవద్దని మాత్రమే వారు కోరుతున్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత మోడీ, షాలను కలిసిన మొదటి నేతల్లో బుఖారీ ఒకరు. ఇక ఆజాద్ రాజ్యసభ నుంచి రిటైర్ అయినప్పుడు మోడీ నుండి భావోద్వేగ పూరితమైన వీడ్కోలు లభించింది. ఈ మూడు పార్టీలు మాత్రమే కాకుండా మరికొన్ని చిన్నా చితకా పార్టీలు కూడా ఎన్నికల బరిలో దిగాయి.

ఎన్నికల ప్రాధాన్యత

జమ్మూకాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవి. 2022లో ఎన్నికల కమిషన్ పునర్విభజన ప్రక్రియను చేపట్టి జమ్మూలో 43, కాశ్మీర్‌లో 47 స్థానాలను గుర్తించింది. జమ్మూలో ఆరు, కాశ్మీర్‌లో మూడు స్థానాలను ఎస్టీలను రిజర్వ్ చేశారు. అసెంబ్లీ స్థానాల్లో మూడో వంతును మహిళలకు కేటాయిస్తూ పార్లమెంట్ 2023లో బిల్లును ఆమోదించింది. వాల్మీకులను ఎస్సీలుగా, పహారీలను ఎస్టీలుగా గుర్తించారు.



సదస్సులో జస్టిస్ చంద్రచూడ్, ప్రధాని మోడీ

మహిళలపై నేరాలు ఆందోళనకరం

- జిల్లా న్యాయ వ్యవస్థల సదస్సులో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, అత్యాచారాలు, బాలల భద్రత తీవ్ర ఆందోళనకరంగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. జిల్లా న్యాయ వ్యవస్థలపై జరిగిన జాతీయ మహాసభ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. మహిళలపై, చిన్నారులపై జరిగే నేరాలపై త్వరితగతిన విచారణ జరిపి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఇటువంటి కేసుల్లో విచారణ చాలా వేగంగా జరగాలని అన్నారు. 2019లోనే ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు నిర్ణయం తీసుకుందన్నారు. ఎలాంటి భయం లేకుండా సాక్ష్యం చెప్పే సాక్షులకు రక్షణ కల్పించే కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇటువంటి సున్నితమైన కేసుల్లో సమన్వయ చర్యలు తీసుకునేందుకు జిల్లా జడ్జి, జిల్లా మేజిస్ట్రేట్, ఎస్‌పిలతో జిల్లా కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సుప్రీం కోర్టు ఏర్పడి 75 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా మోడీ ప్రత్యేక స్టాంప్‌ను, నాణాన్ని ఆవిష్కరించారు.

న్యాయం కోసం తొలి గమ్యస్థానం జిల్లా న్యాయవ్యవస్థ : జస్టిస్ చంద్రచూడ్

ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ప్రసంగిస్తూ.. న్యాయం కోసం సామాన్యుడు ఆశ్రయించే తొలి గమ్య స్థానం జిల్లా న్యాయవ్యవస్థ అని తెలిపారు. మొత్తంగా న్యాయ వ్యవస్థకు ఇది వెన్నుముక వంటిదన్నారు. జిల్లా న్యాయ వ్యవస్థను సబార్డినేట్ న్యాయ వ్యవస్థగా పిలవడం మానం మానాలన్నారు. స్వాతంత్య్రం లభించిన 75 ఏళ్ల తర్వాత బ్రిటీష్ కాలం నాటి ఒక అవశేషాన్ని మనం వదిలించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అదే 'వలసవాద లొంగుబాటు ధోరణి' అని చీఫ్‌జస్టిస్ చెప్పారు. జిల్లా న్యాయవ్యవస్థలో మరింత మంది మహిళలు చేరుతున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేరళలో తాజా రిక్రూట్‌మెంట్‌లో మొత్తం జ్యుడీషియల్ అధికారుల్లో 72 శాతం మహిళలేనని అన్నారు.

సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్‌న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ ట్రయల్ కోర్టులు, జిల్లా కోర్టులు కొన్ని కేసుల్లో బెయిల్ మంజూరు చేయడానికి ఇష్టపడవని, ఇది ఇందులోని అనారోగ్య లక్షణమని అన్నారు. బెయిల్ అనేది రూల్ అని దాన్ని ఇవ్వకుండా ఆపడానికి వీల్లేదని ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. ఎలాంటి పక్షపాతం లేకుండా, భయం లేకుండా త్వరితగతిన న్యాయం అందించేలా మన ట్రయల్ కోర్టులకు, జిల్లా,సెషన్స్ కోర్టులకు సాధికారత కల్పించాల్సిన అవసరం వుందని అన్నారు. ఈ స్థాయిలో న్యాయవ్యవస్థ ప్రజల మనస్సుల్లో విశ్వాసం నెలకొల్పుతుందన్నారరు. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, జ్యుడీషియల్ అధికారులు, ఇంకా పలువురు ప్రముఖులుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆ ఆదేశాలను ఉపసంహరించుకోండి

- కేంద్రాన్ని కోరిన మాజీ సీనియర్ అధికారులు

న్యూఢిల్లీ : ఆర్‌ఎస్‌ఎస్‌లో ప్రభుత్వోద్యోగుల చేరికపై అమలులో ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కాన్‌స్టిట్యూషనల్ కండక్ట్ గ్రూపునకు చెందిన మాజీ సీనియర్ అధికారులు మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ విదేశాంగ కార్యదర్శులు సుజాతా సింగ్, శివశంకర్ మీనన్ సహా 115 మంది రిటైర్డ్ సీనియర్ అధికారులు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'భారత రాజ్యాంగ లౌకిక స్వభావాన్ని, బహుళత్వాన్ని తిరస్కరించే సంఘంలో జిల్లా మెజిస్ట్రేట్, పోలీస్ అధికారి, ప్రభుత్వ కార్యదర్శి, ప్రొఫెసర్, ఉపాధ్యాయుడు లేదా ప్రభుత్వ వైద్యుడు బహిరంగంగానే సభ్యుడు కావచ్చునని ప్రభుత్వ ఆదేశాలు చెబుతున్నాయి. లేదా అతను ఆ సంఘం కార్యకలాపాలలో భాగస్వామి కావచ్చు. పదవీ విరమణ సమయంలో హైకోర్టు న్యాయమూర్తులు ఇటీవల చేసిన ప్రకటనలు వారికి ఆర్‌ఎస్‌ఎస్‌తో ఉన్న సైద్ధాంతిక అనుబంధాన్ని బయటపెట్టడం విచారకరం' అని ఆ ప్రకటనలో మాజీ ప్రభుత్వాధికారులు అభిప్రాయపడ్డారు.



కేంద్రం తీరుకు నిరసనగా సిద్ధరామయ్య ధర్నా

బెంగళూరు: కర్నాటకలో రాజకీయం వేడెక్కుతోంది. గవర్నరు కార్యాలయాన్ని తమ జేబు సంస్థంగా మార్చుకొని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేపడుతున్న నిరంకుశ చర్యలను నిరసిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధర్నా చేపట్టడం చర్చనీయాంశమైంది. బెంగళూరులో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల కేటాయింపులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై దర్యాప్తు చేయాలని ఆ రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. అయితే రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలనే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గవర్నరు కార్యాలయం ద్వారా ఇలాంటి చర్యలకు పూనుకుంటోందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. ఈ నేపథ్యంలోనే సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి శివకుమార్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పతంజలి పండ్లపొడిలో మాంసాహార పదార్థాలు

- ఢిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ : దివ్య దంతమంజన్ పండ్లపొడిలో మాంసాహార పదార్థాలు ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌ను పురస్కరించుకొని ఢిల్లీ హైకోర్టు బాబా రాందేవ్, పతంజలికి చెందిన దివ్య ఫార్మసీకి నోటీసులు జారీ చేసింది. పండ్లపొడిలో శాఖాహార పదార్థాలు మాత్రమే ఉన్నాయని చెప్పి, అందులో మాంసాహార సంబంధమైన పదార్థాలు కలిపారని పిటిషనర్ యతిన్ శర్మ ఆరోపించారు. ప్యాక్‌పై పండ్లపొడి శాఖాహార ఉత్పత్తేనని సూచించే ఆకుపచ్చ చుక్క ఉన్నదని, కానీ పదార్థాల జాబితాలో మాంసాహారానికి సంబంధించిన కటిల్ ఫిష్ ఉన్నదని ఆయన తెలియజేశారు. కాగా ఈ కేసు విచారణ నవంబర్ 28వ తేదీన జరుగుతుంది.

మీకు అండగా ఉంటా!

(మొదటి పేజీ తరువాయి)


హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారా..? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు రాజకీయాల గురించి తాను మాట్లాడనని, తన కుటుంబాన్ని (రైతులు) కలిసేందుకే ఇక్కడికి వచ్చానని అన్నారు. ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని వినేశ్ డిమాండ్ చేశారు. కనీస మద్ధతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని, ఇతర డిమాండ్ల సాధనకు ఈ ఏడాది ఫిబ్రవరి 13 ఛలో ఢిల్లీకి వెళ్తున్న రైతులను ఢిల్లీని ఆనుకుని వున్న శంభు బోర్డర్‌లో భద్రతా దళాలు అడ్డుకోవడంతో అప్పటి నుంచి వారు అక్కడే గుడారాలు వేసుకుని నిరసన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఢిల్లీ పరిసరాల్లోని ఖనౌరీ, శంభు, రతన్‌పుర బార్డర్‌లను ముట్టడించాలని రైతులు నిర్ణయించారు. నిరసనను శాంతియుతంగానే నిర్వహించినట్లు రైతు సంఘాల నేత స్వర్ణ సింగ్ పంధేర్ తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. నిరసనలు 200 రోజులు పూర్తి చేయడం ఓ మైలురాయిగా రైతు నేతలు అభివర్ణించారు. ౖతుల ఉద్యమాన్ని బంగ్లాదేశ్ పరిస్థితులతో పోల్చిన బాలీవుడ్ నటి, బిజెపి ఎంపి కంగన రనౌత్‌పై రైతు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎయిమ్స్‌లో ఏచూరికి చికిత్స



న్యూఢిల్లీ : శ్వాసకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరికి న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు సిపిఎం కేంద్ర కమిటీ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. గత కొన్నిరోజులుగా ఏచూరి శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆగస్టు 19 తేదీన ఆయన ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. మొదట ఎమర్జెన్సీ వార్డులో చికిత్స తీసుకున్నారు. ఆ తర్వాత ఆయనను వైద్యులు ఐసియుకి తరలించారు. ప్రస్తుతం ఆయనకు ప్రత్యేక వైద్య నిపుణుల బృందం చికిత్సనందిస్తోందని, అయితే ఆయనను ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తామనే విషయాన్ని వైద్యులు వెల్లడించలేదని సిపిఎం కేంద్ర కమిటీ తన ప్రకటనలో పేర్కొంది.

కేరళ ఎల్‌డిఎఫ్ కన్వీనర్‌గా టిపి రామకృష్ణన్



తిరువనంతపురం : కేరళలో వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) కన్వీనర్‌గా టిపి రామకృష్ణన్‌కు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం జరిగిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ తెలిపారు. ఈ పదవిలో ఇదివరకు ఉన్న ఇపి జయరాజన్ తన బాధ్యతల నిర్వహణలో కొన్ని 'పరిమితులు' ఎదుర్కోవాల్సివచ్చిందని, అందువల్లే మార్పు అవసరమైందన్నారు. ఈ మార్పు అనేది జయరాజన్‌పై చర్య తీసుకున్నట్లుగానో, ఆయనను మందలించినట్లుగానో పరిగణించరాదని తెలిపారు. జయరాజన్ ఇప్పటికీ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారని గోవిందన్ తెలిపారు.

22 మందితో రష్యా హెలికాప్టర్ గల్లంతు

మాస్కో : రష్యాలోని కంచట్కా దీవిలో 22 మందితో వున్న హెలికాప్టర్ ఆచూకీ గల్లంతైంది. వీరిలో ఎక్కువమంది పర్యాటకులే వున్నారు. 19 మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ప్రయాణిస్తున్న ఎంఐ-8 హెలికాప్టర్‌తో తెల్లవారు జామున 4.15 గంటల సమయంలో కమ్యూనికేషన్ సంబంధాలు తెగిపోయాయని కంచట్కా గవర్నర్ వ్లాదిమిర్ సొలొదొవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారంర టెలిగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేశారు. గల్లంతైన హెలికాప్టర్ కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. 1960వ దశకానికి చెందిన ఎంఐ-8 హెలికాప్టర్‌ను రష్యాలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఈ హెలికాప్టర్లు కూలిపోవడం కూడా ఎక్కువగానే జరుగుతుంటాయి. 25 కిలోమీటర్లు దూరం వెళ్లాక అకస్మాత్తుగా రాడార్‌లో కనిపించకుండా పోయిందని ఎమర్జన్సీ సర్వీస్ అధికారులు తెలిపారు.

చిత్ర పరిశ్రమలో మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

- ఎమ్మెల్యేపైనా చర్యలు
- దేశానికే మోడల్‌గా హేమా కమిటీ
- సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి గోవిందన్

తిరువనంతపురం : చలనచిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనానికి దేశంలోనే తొలిసారిగా వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం మాత్రమే కమిటీ ఏర్పాటు చేసిందని సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ తెలిపారు. హేమా కమిటీ నివేదికలో ప్రతిపాదించిన అంశాలపై ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చిత్ర పరిశ్రమలోని నటులతో పాటు అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులందరూ పూర్తి భద్రతా భావంతో పనిచేసేందుకు వీలైన అన్ని చర్యలూ చేపట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హేమా కమిటీ నివేదికలో వ్యక్తిగత విషయాలు మరియు గోప్యతను ప్రభావితం చేసే అంశాలు ఉన్నందునే బహిర్గతం చేయడం లేదన్నారు. అయితే ఈ విషయంలో ఎటువంటి



పక్షపాతమూ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అధికార పార్టీ ఎమ్మెల్యేపైనా కేసు నమోదు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా జయరాజన్ గుర్తు చేశారు. ఇలాంటి సమస్యల పట్ల కాంగ్రెస్ కానీ, బిజెపి కానీ ఏనాడూ చర్యలు తీసుకున్న ఆనవాళ్లు లేవన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కున్నపల్లి, ఎం విన్సెంట్‌పైనా ఆరోపణలు వచ్చినా కూడా వారు రాజీనామా చేయలేదని, ఎల్‌డిఎఫ్ మాత్రమే నిష్పక్షపాతంగా వ్యవహరించిన విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. అందరికీ సమానంగా న్యాయం జరగాలన్నదే తమ పార్టీ విధానమన్నారు. చలనచిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు చలనచిత్ర పరిశ్రమ కోసం ప్రత్యేకంగా విధానాన్ని రూపొందించేందుకు షాజీ ఎన్ కరుణ్ నేతత్వంలో కమిటీని నియమించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సినిమా రంగంలో ప్రభుత్వ జోక్యం ఆదర్శప్రాయంగా మారనుంది. దేశంలో 135 మంది ఎమ్మెల్యేలు, 16 మంది ఎంపీలు మహిళలపై నేరాలకు పాల్పడిన అభియోగాలు ఎదుర్కొంటున్నారని, వారెవరూ తమ పదవులకు రాజీనామా చేయలేదన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరగాలన్నదే తమ పార్టీ వైఖరన్నారు. హేమా కమిటీ నివేదికపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, అయితే మలయాళ చిత్ర పరిశ్రమ మొత్తం చెడ్డదని ప్రచారం చేసే ధోరణి సరైనది కాదని ఆయన అన్నారు. సినిమా కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన చాలా మంది వ్యక్తుల కృషితోనే మలయాళ సినిమా ఎదిగిందని కొనియాడారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తోందని, కెఐఎఫ్‌బిఐ పథకం ద్వారా ప్రభుత్వ నిర్వహణలోని థియేటర్లను ఆధునీకరించామని తెలిపారు. దేశంలోనే ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహిస్తున్న ఏకైక ఒటిటి వేదికను కూడా కేరళ ప్రభుత్వమే నిర్వహిస్తోందని ఆయన గుర్తు చేశారు.

తప్పు చేసినట్లు ఆధారాలుంటే శిక్షించాల్సిందే

- హేమ కమిటీ నివేదికపై మోహన్‌లాల్ వ్యాఖ్య

మలయాళ చలనచిత్ర పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్టులోని అంశాలపై ప్రముఖ నటుడు మోహన్‌లాల్ స్పందిస్తూ, తప్పు చేసినట్లు ఆధారాలుంటే శిక్షించాల్సిందేనని అన్నారు. హేమ కమిటీ నివేదికలో లేవనెత్తిన అంశాలకు యావత్ సినీ పరిశ్రమ జవాబుదారీ వహించాల్సి ఉంటుందన్నారు. అన్నిటికీ యాక్టర్స్ అసోసియేషన్‌నే నిందించడం సరికాదన్నారు. అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్ష పదవికి ఇటీవలే ఆయన రాజీనామా చేశారు. మలయాళ సినిమా పెద్ద ఇండస్ట్రీ అని, అక్కడ వేలాదిమంది ఆర్టిస్టులు పని చేస్తుంటారు. అలాంటప్పుడు అక్కడ జరిగే ప్రతి అంశంపైనా దృష్టి పెట్టడం అసోసియేషన్‌కు సాధ్యం కాదని ఆయన చెప్పారు. సినిమా కూడా సమాజంలో భాగమేనని, మిగతా రంగాల్లో మాదిరే ఈ రంగంలోనూ కొన్ని జరుగుతుంటాయని ఆయన శనివారం నాడిక్కడ మీడియాతో అన్నారు. మలయాళీ సినీ పరిశ్రమలో మహిళా ఆర్టిస్టులు లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు వచ్చిన ఆరోపణలపై హేమ కమిటీ విచారించి ఇచ్చిన నివేదికపై మోహన్‌లాల్ తొలిసారి స్పందించారు.

బ్రెజిల్‌లో ఎక్స్ సేవలపై నిషేధం

బ్రెజిల్ : సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్ బిలియనీర్ యజమాని ఎలాన్‌మస్క్ దేశంలోని చట్టపరమైన తమ ప్రతినిధిని పేర్కొనడానికి నిరాకరించడంతో బ్రెజిల్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డి మోరేస్ శుక్రవారం బ్రెజిల్‌లో ఎలోన్ మస్క్ నిర్వహించే ఎక్స్ ని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. దీంతో బ్రెజిల్‌లో ఎక్స్ సేవలను పూర్తిగా నిలిపివేస్తూ అక్కడి టెలికాం శాఖ చర్యలు తీసుకుంది. ఆ దేశ సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు టెలికామ్ విభాగం ఈ చర్యలు తీసుకొన్నట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. దీంతో ఇక్కడి ప్రజలకు ఎక్స్‌లోకి లాగిన్ అవడం సాధ్యం కావడం లేదు. బ్రౌజర్‌ను రీలోడ్ చేసి లాగిన్ అవ్వండి అంటూ పదేపదే సందేశాలు కనిపిస్తున్నాయి.

యాపిల్, గూగుల్‌కు 5 రోజుల గడువు...

మరోవైపు టెక్ దిగ్గజాలైన యాపిల్, గూగుల్‌కు న్యాయమూర్తి మోరాసే ఐదు రోజుల గడువు విధించారు. ఈలోపే వాటి ఆండ్రాయిడ్, ఐవోఎస్ అప్లికేషన్ల నుంచి ఎక్స్‌ను తొలగించాలని సూచించారు. అంతేకాదు వీపీఎన్ సాయంతో వ్యక్తులు లేదా వ్యాపారసంస్థలు ఎక్స్‌లో లాగిన్ అయితే 5,000 డాలర్ల ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎక్స్ బ్రెజిల్‌లో న్యాయ ప్రతినిధిని ఏర్పాటు చేసేవరకు ఈ నిషేధం కొనసాగుతుందని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.



వైద్యుల రక్షణకు తక్షణమే చట్టం

- జాతీయ టాస్క్ ఫోర్స్‌కు ఐఎంఎ మరోమారు లేఖ

న్యూఢిల్లీ : వైద్యులు, ఆస్పత్రులపై జరుగుతున్న హింసను అరికట్టడానికి తక్షణమే కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని, ఆస్పత్రులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) శనివారం మరోసారి డిమాండ్ చేసింది. ఆరోగ్య సంరక్షణ సిబ్బంది, వృత్తి నిపుణులకు భద్రత, రక్షణ కల్పించేలా ప్రొటోకాల్‌ను రూపొందించేందుకు ఏర్పడిన జాతీయ టాస్క్ ఫోర్స్‌కు ఐఎంఎ ఈ విషయమై లేఖ రాసింది.

డాక్టర్లపై, ఆస్పత్రులపై జరుగుతున్న హింసాత్మక చర్యల నుండి రక్షణ కల్పించేందుకు కేంద్రం ఒక చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ, 'రాత్రి పూట విధుల్లో భద్రత' అనే అంశంపై తాము నిర్వహించిన అధ్యయన వివరాలను ఐఎంఎ టాస్క్‌ఫోర్స్‌కు అందచేసింది. దేశవ్యాప్తంగా 3885 మంది డాక్టర్లను సర్వే చేశారు. కేంద్ర చట్టానికి ముసాయిదా ప్రతిపాదన, ముసాయిదా చట్టమైన హెల్త్‌కేర్ సర్వీస్ పర్సనల్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ వయొలెన్స్ అండ్ డ్యామేజ్ టు ప్రాపర్టీ) బిల్, 2019, ఎపిడెమిక్ డిసీజెస్ (సవరణ) చట్టం, సెప్టెంబరు 2020 తదితరాలను అనుబంధ పత్రాలుగా జత చేసి ఆ లేఖతో పాటు అందచేశారు. కేంద్ర చట్టం కావాలన్న తమ డిమాండ్‌ను సమర్థించుకుంటూ మౌలిక సదుపాయాల దృష్ట్యా, మానవ వనరుల రీత్యా ఆరోగ్య సంరక్షణ సదుపాయాలనేవి మారుతూ వస్తాయని ఐఎంఎ తన లేఖలో పేర్కొంది. ఇటువంటి చట్టం లేకపోవడం వల్ల పోలీసులు అరకొర చర్యలు చేపట్టడానికి దారి తీస్తోందని పేర్కొంది. సరైన, సమగ్ర విచారణ లోపిస్తోందని పేర్కొంది. అన్ని రంగాల వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న హింసను నివారించడానికి పటిష్టమైన చట్టాన్ని తీసుకువస్తే అది బలమైన ప్రభావాన్ని చూపిస్తుందని,, రాష్ట్రాలు కూడా తమ వంతు చట్టాలు చేయడానికి వీలు కల్పిస్తుందని ఆ లేఖ పేర్కొంది. ఇక ఆస్పత్రులను సేఫ్ జోన్‌లుగా ప్రకటించాలన్న భావన ప్రతిపాదిత చట్టంలోనే వుండాలని కోరింది. రెసిడెంట్ డాక్టర్ల పని, జీవన పరిస్థితులు మెరుగుపరచాలని డిమాండ్ చేసింది. రెసిడెంట్ వ్యవస్థను ఏర్పడినప్పటి నుండి అనేక పాలనాపరమైన, జ్యుడీషియరీ ప్రకటనలు వెలువడ్డాయి కానీ క్షేత్ర స్థాయిలో మారిన అంశాలు చాలా తక్కువ అని ఆ లేఖ పేర్కొంది. జాతీయ టాస్క్ ఫోర్స్ తన ఆకాంక్షలు, అభిప్రాయాలకు తగినట్లుగా వ్యవహరించగలదని, నైతిక స్థైర్యం కోల్పోయిన డాకక్టర్ల మదిలో విశ్వాసాన్ని పునరుద్ధరించగలదని ఆశిస్తున్నట్లు ఐఎంఎ ఆ లేఖలో పేర్కొంది.

వికసిత భారత్ దిశగా అడుగులు : మోడీ

- మరో మూడు వందే భారత్ రైళ్లు ప్రారంభం

న్యూఢిల్లీ : వికసిత భారత్ దిశగా తమ ప్రభుత్వం అడుగులేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న అనేక అంశాలను పరిష్కరిస్తూ రైల్వేలు ముందడుగు వేస్తున్నాయని ఆయన చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మూడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళను శనివారం ఆయన ప్రారంభించారు. మీరట్-లక్నో, మదురై-బెంగళూరు, చెన్నై, నాగర్‌కోయిల్‌ల మధ్య ఈ మూడు రైళ్లు ప్రయాణిస్తాయి. వికసిత భారత్‌కు ఆధునిక రైల్ల వ్యవస్థ బలమైన మూల స్తంభం వంటిదని మోడీ అన్నారు. దక్షిణ భారతదేశంలో అపారమైన ప్రతిభ, అద్భుతమైన అవకాశాలు వున్నాయన్నారు. తమిళనాడుతో పాటూ మొత్తంగా దక్షిణ భారతాన్ని అభివృద్ధిపరచడం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని మోడీ చెప్పారు.



కలిసి వుంటేనే కలదు సుఖం



పచ్చగ విరిసిన చక్కని అడివిన
పిల్ల పక్షుల గొడవాయే
నేనంటే నేను ఎక్కువని
రెక్కలాడిస్తు రొదనాయే.

ఏమిటర్రా ఈ గొడవంటూ
ఆరా తీసేను ముదుసలి పక్షి.
పిల్లల మధ్య గొడవలెందుకని
సర్ది చెప్పగా మధ్యకు వచ్చె.

పాటలలో నేనే మేటి
అంటూ పలికెను కోయిల పిల్ల
నాట్యంలో నాసాటెవరని
గెంతులు వేసేను నెమలమ్మ.

మాటలలో ఎవ్వరు పోటీ
అని మాట్లాడేను ఓ పిల్ల మైనా.
అందంలో నేనే ముందని
బంధం వేసేను చిన్నారి చిలుక.

నాలాగ గూడు కట్టమని
సవాలు విసిరెను గిజిగాడు.
చెట్టును సైతం విరిచేస్తానని
ముక్కు చూపెను వడ్రంగి పిట్ట.

పక్షి పిల్లలు ఒక్కటొక్కటిగ
వాటి గొప్పలు చెప్పు చుండగ
మౌనంగా వుండిపోయేను
నల్ల నల్లని పిల్ల కాకమ్మ.

అన్ని పక్షులలో ఏదో గొప్ప
ఇమిడి వున్నది అబ్బబ్బా
ఏ ప్రత్యేకత లేకుండా
నేనిలా వున్నాను ఏందబ్బా?

అనుకుంటూ కావు కావని
కాకమ్మ బాధ పడగానే
గుంపుగా వచ్చి చెంతను వాలే
హితులు, సన్నిహితులంతా .


చూశావా పిల్ల కాకమ్మ
నీ బలగానికి సాటెవరు
ఇక్కడున్న ఏ పక్షి పిలిచినా
ఇంతమంది రానే రారు.

అందం చందం ముఖ్యం కాదు
అనుబంధాలే వుండాలి.
ఒకరికి ఒకరు తోడుగా వుంటూ
ఆనందాలను పంచాలి.

వివరించెను ఆ ముదుసలి పక్షి
పక్షి పిల్లలు శ్రద్ధగా విన్నవి.
కలిసి వుంటేనే కలదు సుఖమంటూ
పిల్ల కాకితో స్నేహమన్నవి!

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880

నేను గీసిన బొమ్మ





కె. లఖన్ 4వ తరగతి,
సెయింట్ఆన్స్ స్కూల్,
పేరాల, ఎర్రుపాలెం. బాపట్ల.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నటన ఆయనకు ఆరో ప్రాణం..

1975.. దేశంలో ఎమెర్జెన్సీ అమలులో వున్న రోజులు. అలాంటి స్థితిలో ఆనాటి రాజకీయ స్థితిగతులను, ప్రజల అవస్థలను, పాలకుల అవకాశవాద, నియంతృత్వ పోకడలను తూర్పారబడుతూ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు 'పలుకే బంగారమాయె' పేరుతో ఓ సంచలన నాటకం రాశారు. ఆ నాటకంతో రంగప్రవేశం చేసిన కె.వి.సుబ్బారాయుడు ఆనాటి నుండి నటనే ఆరోప్రాణంగా రంగస్థలంపై రాణించారు.







గొప్ప సాహితీవేత్తలు, ప్రసిద్ధులైన నాటక రచయితలు చేయని ఆ ప్రయోగ నాటకంలో తెలుగు సాహిత్యంలో, సజీవ పాత్రల్లా అజరామరంగా నిలిచిపోయిన 'గిరీశం' (గురజాడ అప్పారావు కన్యాశుల్కం) బారిష్టరు పార్వతీశం (మొక్కపాటి నరసింహ శాస్త్రి నవలా నాయకుడు) చిలకమర్తి లక్ష్మీ నరసింహం సృజియించిన 'గణపతి', మునిమాణిక్యం నరసింహారావు గారి అపూర్వ సృష్టి 'కాంతం', అడవి బాపిరాజు గారి 'కోనంగి' వంటి పాత్రలను ప్రయోగాత్మకంగా, ప్రతీకాత్మకంగా భాగం చేశారు.

ఆ నాటకంలో బారిష్టరు పార్వతీశంగా నటించిన 'కొడుకుల వెంకట సుబ్బారాయుడు' అనే, ఓ బ్యాంకు ఉద్యోగి, 'మొక్కపాటి, తన కోసమే 'బారిష్టరు పార్వతీశం'ను సృష్టించారా' అన్నంతగా ఆ పాత్రలో లీనమై నటించారు. అప్పటికి పెద్దగా నాటకానుభవం లేకపోయినా, ఆ పాత్రలోని గొప్ప చిత్రీకరణ, దాడి వీరభద్రరావు గారి దర్శకత్వ ప్రతిభ, సుబ్బారాయుడు వంటి నటులను ఆ తరం ప్రేక్షక హృదయాలలో చిరస్థాయిగా నిలిచేలా చేసింది. నాటకరంగ నిపుణులు, నాటక విమర్శకుల హృదయాలలో కూడా మంచి ఆదరణ చూరగొంది. ఆ ఆదరణ బ్యాంకు ఫిక్స్డ్ డిపాజిట్‌గా మార్చేసిందనడం అతిశయోక్తి కాదు.

సుబ్బరాయుడు ఉమ్మడి విశాఖ జిల్లా అనకాపల్లిలో జన్మించారు. పాఠశాల, కళాశాల విద్య అనకాపల్లిలోనే సాగింది. పన్నెండేళ్ళ వయస్సు నుండీ, సుబ్బారాయుడులో మొగ్గ తొడిగిన నటనా జిజ్ఞాస, 1967లో ఫలించింది. ఎ.ఎం.ఎ.ఎల్. కళాశాల విద్యార్థిగా 'ఈ ఇల్లు అమ్మబడును' నాటికలో నటించడంతో, నటనలో అరంగ్రేటం చేశారు. ఆ తర్వాత, 'పరిశోధన', 'దంత వేదాంతం', 'ఏక్ దిన్ కా సుల్తాన్' వంటి నాటికలలో నటించారు. కళాశాల రోజుల్లోనే, హిందీ అధ్యాపకునిగా, నాటక దర్శకునిగా, కె.వి. సుబ్బారాయుడిలోని ప్రతిభను గుర్తించిన, దాడి వీరభద్రరావు, 'పలుకే బంగారమాయె'లో 'బారిష్టరు పార్వతీశం' పాత్రనిచ్చి ప్రోత్సహించారు. అప్పటికే ఆ నాటకంలోని మరో ప్రధాన పాత్రధారులైన' పీలా కాశీ మల్లికార్జున రావు, పి.ఆర్.జె. పంతులు గార్ల సాన్నిహిత్యంతోనే ఆ పాత్రకు న్యాయం చేయగలిగానని సుబ్బారాయుడు చాలా సందర్భాల్లో గుర్తుచేసుకునేవారు. అప్పటికే, అధ్యాపక, విద్యార్థులుగా, దాడి వీరభద్రరావుతో వున్న పరిచయంతో, మాష్టారు తనను బాగా తీర్చిదిద్దారని కూడా చెప్పేవారు.

రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో దాదాపు రెండు వందల ప్రదర్శనలిచ్చిన 'పలుకే బంగారమాయె'లో నటించడం అతని నట జీవితాన్ని రాటుదేల్చింది. ఆ తర్వాత, దాడి వీరభద్రరావు రచించిన 'రాజసూయాగం' విశాఖలోని ప్రముఖ నట దర్శకులు కె.మందులు దర్శకత్వంలో ఏభై సార్లు నటించారు. ఆ నాటకం కూడా మంచి ప్రేక్షకాదరణంతో, దేశంలో పలుచోట్ల ప్రదర్శించారు.

దాడి మరో గొప్ప రచన 'అనగనగా ఒక రాజు'లో 'రాజు' పాత్రలో కూడా సుబ్బరాయుడు నటించారు. ఆ తర్వాత 'సెలవు కావాలి', 'ఉలిపికట్టె', 'చివరకు మిగిలేది', 'రెండు రెళ్ళు ఆరు', 'పండగొచ్చింది', అతిథి దేవుళ్ళొస్తున్నారు', 'నాటకాల రాయుడు', 'చూడు చూడు నీడలు', 'పద్మవ్యూహం', 'నిర్మానుశ్యం', 'హళ్ళికి హళ్ళి', 'ముగింపు లేని కథ' వంటి నాటిక, నాటకాల్లో నటించారు. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రఖ్యాత కన్నడ రంగస్థల సినీ నటులు, దర్శకులు గిరీశ్ కర్నాడ్ గారి దర్శకత్వంలో, 'అగ్నివర్షం'లో ప్రధాన పాత్ర ధరించి మూడు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఎస్.బి.ఐ. ప్రతి ఏటా నిర్వహించే, అంతర్ విభాగ నాటిక పోటీలలో, 'ఉత్తమ హాస్యనటుడు', 'క్యారెక్టర్ నటుడు' వంటి పదిహేడు బహుమతులు స్వీకరించారు. అయిదు నాటికలకు దర్శకత్వం వహించారు.

విజయనగరం జిల్లా ఎస్.బి.ఐ. అధికారిగా 2008లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఇక అప్పటి నుండి సుబ్బారాయుడు నాటకరంగ వ్యాసంగానికి హైదరాబాద్ కార్యక్షేత్రంగా మారింది. నటనలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది నాటకోత్సవాలలో రెండుసార్లు 'నంది' బహుమతి గెల్చుకున్నారు. భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ పాత్ర నటనకుగాను జ్యూరీ బహుమతి సాధించారు. దూరదర్శన్ నిర్మించిన డా. అంబేద్కర్ టీవీ ఫిల్ములో నటించారు.

ఆధునిక ఔత్సాహిక నాటకరంగంలో అరుదైన నటులు తండ్రీ కొడుకులు గోపరాజు రమణ, గోపరాజు విజయ్‌లతో కలసి, కొలకలూరు సాయి ఆర్ట్సు సంస్థ ద్వారా, నాలుగు సంవత్సరాల పాటు ఏటా ఏభై, అరవై ప్రదర్శనలలో, తెలుగు రాష్ట్రాలలో నటించారు. 'ఆ ప్రయాణంలో గోపరాజు కుటుంబంతో, మంచి అనుబంధం ఏర్పడింది' అని ఆనాటి సంగతులు ఎప్పుడూ చెబుతుంటారు. 'చాలూ ఇక చాలూ', 'బైపాస్', 'పెళ్ళి చేసి చూడు', ఒక్క మాటే చాలు' వంటి నాటికలు కువైట్‌లోను మూడు ప్రదర్శనలిచ్చారు.

నాలుగు పరిషత్తులలో ఉత్తమ నటుడు, 35 వ్యక్తిగత బహుమతులు స్వీకరించారు. నాటకరంగ నిష్ణాతుల్కైన ఎస్.కె. మిశ్రో, శ్రీపాద కుమార శర్మ, తల్లావఝ్జుల సుందరం, కందిమళ్ళ సాంబశివరావు, గోపరాజు రమణ, వై.కె. నాగేశ్వరరావు, కొల్లి మోహనరావు వంటి వారితో సాన్నిహిత్యం వలన నాటకం గురించి ఎంతో విలువైన పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నానని, వారికెప్పుడు ఋణపడి వుంటానని చెప్పే వినయసంపన్నులు.

ఎంత ఎదిగినా ఒదిగి వుండే మనస్తత్వం. 'ఎన్నాళ్ళు, ఎన్ని ప్రదర్శనల్లో నటించినా, ఇంకా తానెంతో నేర్చుకోవాల్సింది వుంది' అంటారు. అమెరికాలో రెండు సంస్కృత నాటికలలో నటించారు. మంచి నటనా సామర్థ్యంతో, నటించిన ప్రతి పాత్రకూ న్యాయంచేసే సుబ్బారాయుడు లాంటి వ్యక్తిత్వం, నిబద్ధత, అవగాహన వున్న నటులు, ఔత్సాహిక నాటక రంగ ప్రస్థానంలో అరుదుగా కనిపిస్తారు.

వృత్తి, ప్రవృత్తి పట్ల కూడా సమానమైన అంకితభావంతో వ్యవహరించడం ఆయనలోని ప్రత్యేకత. 2017 అక్టోబరు నుండి నాటక కార్యకలాపాలకు స్వస్తి పలికారు. 93 టి.వి. సీరియల్స్, 14 చలనచిత్రాలలో నటించిన సుబ్బరాయడికి నాటకం, సాహిత్యం, ఆధ్యాత్మిక అంశాలలో అపారమైన అవగాహన ఉంది.

సినీ నటులతో పోల్చాలని కాదుకానీ, కె.వి. సుబ్బారాయుడు పోలికల్లోనూ, నటనలోనూ, ఒక నాటి ఆంధ్రా దిలీప్ కుమార్‌గా గుర్తింపు పొందిన సినీ నటులు చలంను తలపిస్తారు.

తన ప్రవృత్తి జీవితంలో వెన్నంటి నిలిచిన, తన భార్య శ్రీమతి హైమవతి అకాల మరణంతో సుబ్బారాయుడు ఎంతో కలతకు గురైనారు. ప్రస్తుతం అట్లాంటాలో వుంటున్న తమ కుమార్తె వద్ద వుంటున్నారు. సన్నిహితులందరితో తలలో నాలుకలా మసలే కె.వి. సుబ్బారాయుడు ఆవేదనలోంచి, త్వరగా కోలుకోవాలని కోరుకుందాం. మూడు తరాల నటీనటులతో కలసి నటించిన, ఆ నట నిబద్ధతామూర్తికి తెలుగు నాటక రంగ ప్రేక్షకుల అభివందనాలు.

– బి.వి. అప్పారావు, 93470 39294.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68